జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948

జ్యోతి శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్, విజయవాడ ॥సంపుటి:1 ॥ సంచిక: 73॥ ఆదివారం ॥ 9-8-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-

09 ఆగస్టు 2026 - ఆదివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:01 సూర్యాస్తమయం - సా. 6:41 తిథి ఏకాదశి ఉ. 11:04 వరకు తరువాత ద్వాదశి సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం మృగశిర మ. 2:40 వరకు తరువాత ఆరుద్ర యోగం హర్షణ రా. 1:59ం వరకు కరణం భాలవ ఉ. 11:04 వరకు కౌలవ రా. 9:32 వరకు వర్జ్యం రా. 10:19 నుండి రా. 11:46 వరకు దుర్ముహూర్తం సా. 5:00 నుండి సా. 5:51 వరకు రాహుకాలం సా. 5:06 నుండి సా. 6:41 వరకు యమగండం మ. 12:21 నుండి మ. 1:56 వరకు గుళికాకాలం మ. 3:31 నుండి సా. 5:06 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:25 నుండి తె. 5:13 వరకు అమృత ఘడియలు ఉ. 6:41 నుండి ఉ. 8:08 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:56 నుండి మ. 12:46 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున



# కల్వకుర్తి పంపులు ఆన్

## ప్రతి రోజు 800 క్యూసెక్కుల లిఫ్ట్

**కృష్ణా నదిలో భారీగా వరద ప్రవాహం కొనసాగుతున్నప్పటికీ మహబూబ్‌నగర్ జిల్లాలోని కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, పాలమూరు- రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పంపులను ప్రభుత్వం వారం రోజులుగా ఆన్ చేయలేదని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు.దీంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో తాగునీరు,సాగునీటి కోసం ప్రజలు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు పేర్కొన్నారు.**

మహబూబ్‌నగర్, ఆగస్టు 8:పంపులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచారు. ఆగస్టు 11లోగా పంపులు ఆన్ చేయకపోతే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో నార్లాపూర్ పంప్‌హౌస్ వద్దకు చేరుకుంటామని మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డితో పాటు పాలమూరు, రంగారెడ్డి జిల్లాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ నేతలు హెచ్చరించారు. బీఆర్ఎస్ నేతలు అల్టిమేటం ఇచ్చిన కొద్దిసేపటికే కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పరిధిలోని ఎల్లూరు, జొన్నలబొగడ, గుడిపల్లి పంప్‌హౌస్‌లలో ఇరిగేషన్ అధికారులు మోటార్లను ఆన్ చేశారు. కృష్ణా బ్యాక్‌వాటర్ నుంచి కల్వకుర్తి ఎత్తిపోతలను ప్రారంభించి ప్రతి రోజు 800 క్యూసెక్కుల నీటిని లిఫ్ట్ చేస్తున్నారు. కేఎల్ఐ లోని ఎల్లూరు పంప్ హౌజ్ లో మొదటి పంప్ స్టార్ట్ తరువాయి 2 వ పేజీలో...

# నాగార్జునసాగర్ నీరు తాగునీటికే..

## వరి సాగుపై మంత్రి హెచ్చరిక.. ఆరుతడి పంటలకే ప్రాధాన్యం

## రైతులకు అవగాహన కల్పించాలని కోమటిరెడ్డి ఆదేశం



**ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్నందున రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ వరి సాగును విస్తరించవద్దని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సూచించారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టులో ప్రస్తుతం ఉన్న నీరు తాగునీటికే సరిపోతుందని, పైనుంచి నీటి ప్రవాహం వచ్చే పరిస్థితులు కనిపించడం లేదని అన్నారు.**

నల్గొండ, ఆగస్టు 8: రైతులు ఆరుతడి పంటల సాగు వైపు మళ్లేలా అధికారులు విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. నల్గొండ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశంలో పాల్గొన్న మంత్రి, నాగార్జునసాగర్‌లో ప్రస్తుతం నీరు డెడ్ స్టోరేజ్ స్థాయిలో మాత్రమే ఉందని తెలిపారు. శ్రీశైలం నుంచి నీరు వచ్చినప్పటికీ సాగునీటికి విడుదల చేసే పరిస్థితి లేదని, ప్రస్తుతం ఉన్న నీరు 2027 జూన్ వరకు తాగునీటి అవసరాలకు మాత్రమే ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో సూపర్ ఎల్‌నినో ప్రభావం దక్షిణ తెలంగాణపై తీవ్రంగా ఉండే అవకాశముందని తరువాయి 2 వ పేజీలో..




# 17 నుంచి ఎపి శాసనభ సమావేశాలు

అమరావతి,ఆగస్ట్8: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. 17వ తేదీన ఉదయం 10 గంటల కు శాసన మండలి మొదలు కానుం ది. ఈ మేరకు ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ శనివారం - 2 వ పేజీలో..



# ఇందిరమ్మ ఇండ్లకు భారీ స్పందన

## 7,340 ఫ్లాట్లకు 35 వేలకుపైగా దరఖాస్తులు

## ఇంకా 2 రోజులే గడువు

**హైదరాబాద్ మహానగర పరిధిలో పేద, అల్పాదాయ వర్గాల కుటుంబాలకు సొంత ఇంటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేప ట్టిన ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ పథకానికి విశేష స్పందన లభిస్తోంది.**

హైదరాబాద్, ఆగస్టు 8 :ఈ పథకం కింద నిర్మించనున్న 7,340 ఫ్లాట్ల కోసం ఇప్పటి వరకు 35,125 దరఖాస్తులు అందినట్లు హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వి.పి. గౌతం వెల్లడించారు. దరఖాస్తుల స్వీకరణకు ఆగస్టు 10 వరకు మాత్రమే గడువు ఉండటంతో అర్హులైన ప్రజలు ఈ తరువాయి 2 వ పేజీలో...



# సాగునీటి ప్రాజెక్టులకు వేగం

## రూ.5,000 కోట్ల నిధులకు సీఎం హామీ

### మిడ్ మానేరు ఎడమ కాలువ పనులు పునఃప్రారంభానికి చర్యలు

### పతిపాక జలాశయ డీపీఆర్ ఆగస్టు నెలాఖరులోపు సిద్ధం: ఉత్తమ్

హైదరాబాద్, ఆగస్టు 8 : రాష్ట్రంలో నిలిచిపోయిన సాగునీటి ప్రాజెక్టులకు మళ్లీ వేగం తీసుకురావడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. భూసేకరణ, పునరావాసం, అటవీ అనుమతులు వంటి కారణాలతో ఆలస్యమవుతున్న ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.5,000 కోట్ల నిధులను ప్రాధాన్య క్రమంలో కేటాయించేందుకు హామీ ఇచ్చినట్లు నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఇందులో ఇప్పటికే రూ.2,000 కోట్లు విడుదల కాగా, మిగిలిన రూ.3,000 కోట్లు విడుదల ప్రక్రియలో

# ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

## దుష్ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపు

### టీడీపీ శిక్షణా తరగతుల్లో చంద్రబాబు సూచనలు.. క్రమశిక్షణకు పెద్దపీట



**ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంతో పాటు ప్రత్యర్థులు చేస్తున్న దుష్ప్రచారాలను సమర్థంగా ఎదుర్కోవాలని ముఖ్యమంత్రి, తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో యూనిట్ ఇన్‌చార్జ్‌ల కోసం నిర్వహించిన శిక్షణా తరగతులకు హాజరైన ఆయన కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు.**

మంగళగిరి, ఆగస్టు 8: కార్యకర్తల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకే ఈ శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు, భావజాలాన్ని పూర్తిగా అర్థం చేసుకుని ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న తరువాయి 2 వ పేజీలో..



# 'పెద్ది' కుటుంబానికి రూ.2.25 కోట్లు

## ప్రకటించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

హైదరాబాద్, ఆగస్టు 8: బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్.. 'పెద్ది' కుటుంబానికి పెద్ద దిక్కుగా నిలిచారు. ఇటీవల నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మృతిచెందగా.. ఆయన కుటుంబానికి పార్టీ తరఫున రూ.2 కోట్ల 25 లక్షలను కేసీఆర్ ప్రకటించారు. పార్టీ సీనియర్లు, వరంగల్ జిల్లా ముఖ్య నేతలతో చర్చించి కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. సుదర్శన్ రెడ్డి ఇద్దరు పిల్లలకు తరువాయి 2 వ పేజీలో...




# నీటి హక్కుల పరిరక్షణకు పోరాటం

## ప్రభుత్వ వైఖరిపై కేటీఆర్ తీవ్ర విమర్శలు

హైదరాబాద్, ఆగస్టు 8: రాష్ట్ర ప్రయోజనాలు, ముఖ్యంగా తెలంగాణ నీటి హక్కుల విషయంలో బీఆర్ఎస్ ఎప్పుడూ రాజీ పడదని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. శనివారం మీడియాతో మాట్లాడిన ఆయన రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాలను కాపాడాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, తరువాయి 2 వ పేజీలో...

# సాగునీటి ప్రాజెక్టులకు వేగం

మొదటి పేజీ తరువాయి

ఉన్నాయని వెల్లడించారు. నిధుల కొరత కారణంగా ఏ ప్రాజెక్టు పనులు నిలిచిపోకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో శనివారం జరిగిన సమీక్ష సమావేశంలో ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షత వహించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సమాచార సాంకేతిక, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సామాజిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కలెక్టర్లు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల పరిధిలో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టుల పురోగతిని సమావేశంలో సమగ్రంగా సమీక్షించారు. భూసేకరణ, పునరావాసం, అటవీ అనుమతులు, పర్యావరణ అనుమతులు వంటి పెండింగ్ అంశాలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల వల్ల ప్రభావితమయ్యే కుటుంబాలకు పరిహారం చెల్లింపులు, పునరావాస కార్యక్రమాలు ఇంజినీరింగ్ పనులతో సమాంతరంగా కొనసాగాలని సూచించారు. అవసరమైన నిధుల వివరాలను వెంటనే సమర్పించి ఆమోదాలు పొందాలని కలెక్టర్లకు సూచించారు. రైతులకు త్వరగా సాగునీటి ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నదని తెలిపారు. సమీక్షలో ప్రధానంగా మిడ్ మానేరు ఎడమ కాలువ ప్రాజెక్టు అంశం చర్చకు వచ్చింది. గత నాలుగున్నరేళ్లుగా నిలిచిపోయిన ఈ పనులను తక్షణమే పునఃప్రారంభించేందుకు అవసరమైన భూసంబంధిత సమస్యలను పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. సవరించిన అంచనాలు, టెండర్లు, భూసేకరణ, చట్టపరమైన అనుమతుల ప్రక్రియలను ఒకేసారి ముందుకు తీసుకెళ్లాలని పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తయితే వేలాది ఎకరాలకు సాగునీటి ప్రయోజనం కలుగుతుందని అధికారులు వివరించారు.

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలో ప్రతిపాదించిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి పతిపాక జలాశయ ప్రాజెక్టుపై కూడా సమావేశంలో విస్తృత చర్చ జరిగింది. 3 టీఎంసీలు, 5 టీఎంసీల సామర్థ్యాలతో రెండు ప్రత్యామ్నాయ నమూనాలను పరిశీలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. లిడార్ సర్వే, డేటా ప్రాసెసింగ్ పూర్తయ్యాయని, భూగర్భ పరిశోధనలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఆగస్టు నెలాఖరులోపు డీపీఆర్ సమర్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టు ద్వారా కొత్తగా 10 వేల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు కాకతీయ ప్రధాన కాలువ పరిధిలోని సుమారు 2.40 లక్షల ఎకరాల ఆయకట్టుకు స్థిరీకరణ కల్పించనున్నారు. జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలోని రోళ్లవాగు ప్రాజెక్టుపై కూడా సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం 96 శాతం పనులు పూర్తయ్యాయని, అటవీ అనుమతుల కారణంగా మిగిలిన పనులు నిలిచిపోయాయని అధికారులు తెలిపారు. ప్రత్యామ్నాయ అటవీకరణ కోసం భూమి గుర్తింపు పూర్తయ్యిందని, వన్యప్రాణి సంరక్షణ ప్రణాళికకు కూడా ఆమోదం లభించిందని వెల్లడించారు. ప్రతి ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ, పునరావాసం, అటవీ, పర్యావరణ అనుమతుల పెండింగ్ అంశాల జాబితాను సిద్ధం చేసి, వాటి పరిష్కారానికి గడువులు నిర్ణయించాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల పూర్తి ద్వారా రైతులకు శాశ్వత ప్రయోజనాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

## నేటి రాశి ఫలాలు

మేషం: చేపట్టిన పనులు సకాలంలో పూర్తిచేస్తారు. నూతన వస్తు, వస్త్రలాభాలు పొందుతారు. చిన్ననాటి మిత్రులతో కలుసుకుని విందు వినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు. స్థిరాస్తి వ్యవహారంలో వివాదాలు సర్దుమణుగుతాయి. వ్యాపారాలు మరింత నిదానంగా సాగుతాయి. ఉద్యోగాలలో పని ఒత్తిడి నుండి ఉపశమనం పొందుతారు.

వృషభం: ముఖ్యమైన పనులు మందకొడిగా సాగుతాయి. అధిక కష్టంతో అల్ప ఫలితం పొందుతారు. సోదరులతో భూవివాదాలు కలుగుతాయి. బంధువర్గంతో అకారణంగా వివాదాలు కలుగుతాయి. దైవ సేవా కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. వ్యాపారమున కొన్ని నిర్ణయాలు నష్టాలు కలిగిస్తాయి. ఉద్యోగాలలో అదనపు పనిభారం తప్పదు.

మిధునం: కుటుంబ వ్యవహారాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. సోదరులతో స్థిరాస్తి ఒప్పందాలు చేసుకుంటారు. దూరపు బంధువుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. భాగస్వామ్య వ్యాపారాలకు సకాలంలో పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది.

కర్కాటకం: సన్నిహితుల నుండి ఆర్థిక ఒత్తిడి పెరుగుతుంది. ఇంటా బయట గందరగోళ పరిస్థితులు ఉంటాయి. దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. కుటుంబ సభ్యులతో వివాదాలు కలుగుతాయి. అనారోగ్య సమస్యలు చికాకు పరుస్తాయి. ఉద్యోగాలలో ప్రతికూల వాతావరణం ఉంటుంది. వృత్తి వ్యాపారాలు నిరుత్సాహపరుస్తాయి.

సింహం: ముఖ్యమైన వ్యవహారాలు నిదానంగా పూర్తిచేస్తారు. కుటుంబ సభ్యుల నుంచి ఆశించిన ధన సహాయం అందుతుంది. సోదరులతో కుటుంబ విషయాల గురించి చర్చిస్తారు. దూరపు బంధువుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. వ్యాపారాలు లాభాల బాటలో పయనిస్తాయి. ఉద్యోగమున అధికారులతో వివాదాలు రాజీ అవుతాయి.

కన్య: రావలసిన సొమ్ము సకాలంలో వసూలవుతుంది. ఆత్మీయులతో గృహమున సంతోషంగా గడుపుతారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో విశేషంగా పాల్గొంటారు. చేపట్టిన పనులు అనుకున్న సమయానికి పూర్తి చేస్తారు. వృత్తి, వ్యాపారాలలో స్వంత నిర్ణయాలు అమలు చేసి లాభాలు అందుకుంటారు. ఉద్యోగస్తుల పనితీరుకు అధికారుల నుండి ప్రశంసలు అందుతాయి.

తుల: పాత ఋణాలు తీర్చడానికి నూతన ఋణప్రయత్నాలు చేస్తారు. బంధు మిత్రులతో స్వల్ప వివాదాలు కలుగుతాయి. కుటుంబ సభ్యులతో దైవదర్శనం చేసుకుంటారు. వ్యాపారాలలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం మంచిది కాదు. నిరుద్యోగ యత్నాలు నిరుత్సాహపరుస్తాయి. ఉద్యోగస్తులకు కష్టానికి తగిన ఫలితం అందదు.

వృశ్చికం: చేపట్టిన పనులు శ్రమాధిక్యతతో కానీ పూర్తికావు. కొన్ని విషయాలలో సోదరులతో వివాదాలు కలుగుతాయి. ఆర్థిక పరిస్థితి నిరాశ కలిగిస్తుంది. భూ సంబంధిత వివాదాలు కొంత ఒత్తిడి కలిగిస్తాయి. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయడం మంచిది కాదు. నూతన వ్యాపారాలు ప్రారంభానికి అవరోధాలు కలుగుతాయి. ఉద్యోగస్తులకు అధికారుల నుండి పని ఒత్తిడి పెరుగుతుంది.

ధనస్సు: సమాజంలో ప్రముఖులతో నూతన పరిచయాలు కలుగుతాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. రావలసిన డబ్బు సకాలంలో చేతికి అందుతుంది. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. వ్యాపార, ఉద్యోగాలలో అంచనాలు అందుతాయి.

మకరం: సంతాన విద్యా విషయాలపై దృష్టి సారిస్తారు. రాజకీయ వర్గాల ప్రముఖుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. చేపట్టిన పనులలో శ్రమకు తగిన ఫలితం పొందుతారు. భూ సంభందిత క్రయ విక్రయాలు లాభసాటిగా సాగుతాయి. వ్యాపారాలు విస్తరిస్తాయి. ఉద్యోగాలలో ఉన్నత పదవులు పొందుతారు.

కుంభం: ముఖ్యమైన పనులు వాయిదా పడతాయి. ప్రయాణాలలో మార్గవరోధాలు కలుగుతాయి. వృధా ఖర్చులు పెరుగుతాయి. కుటుంబ సభ్యులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. శారీరక మానసిక అనారోగ్య సమస్యలు చికాకు పరుస్తాయి. వ్యాపారాలు మందగిస్తాయి. ఉద్యోగ వాతావరణం చికాకు కలిగిస్తుంది.

మీనం: కుటుంబ సభ్యుల ప్రవర్తన కొంత చికాకు కలిగిస్తుంది. చేపట్టిన పనులలో వ్యయప్రయాసలు అధికమౌతాయి. సన్నిహితులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు నిరాశ కలిగిస్తాయి. చిన్ననాటి మిత్రులతో దైవదర్శనాలు చేసుకుంటారు. వృత్తి ఉద్యోగములు సామాన్యంగా సాగుతాయి.



## ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మొదటి పేజీ తరువాయి

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడం ప్రతి కార్యకర్త బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ప్రజలకు తెలియజేయకపోతే తప్పుడు ప్రచారాన్ని నమ్మే పరిస్థితులు ఏర్పడతాయని చంద్రబాబు అన్నారు. అందుకే ప్రత్యర్థి పార్టీలు చేస్తున్న ఆరోపణలు, కుట్రలను ఎప్పటికప్పుడు ప్రజల ముందే ఖండించాలని సూచించారు. డీఎస్సీ పరీక్షల నిర్వహణ విషయంలో కూడా తప్పుడు ప్రచారం జరిగిందని, అయితే ప్రభుత్వం వాస్తవాలను ప్రజల ముందు ఉంచి దానికి సమాధానం చెప్పగలిగిందని పేర్కొన్నారు. డీఎస్సీ నియామకాల ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని, ఎలాంటి తప్పిదాలు లేవని ప్రభుత్వం స్పష్టం చేయడంతో అనేక మంది కూడా అదే విషయాన్ని అంగీకరిస్తున్నారని చంద్రబాబు తెలిపారు. డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులే ఇప్పుడు తప్పుడు ప్రచారాలను వ్యతిరేకిస్తూ ముందుకు వస్తున్నారని అన్నారు. ప్రజల ముందు నిజాలు ఉంచితే అసత్యాలు నిలవవని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సవాళ్లతో కూడుకున్నప్పటికీ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను సమానంగా ముందుకు తీసుకెళ్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు. భోగాపురం విమానాశ్రయం వంటి ప్రాజెక్టులకు ప్రజల నుంచి లభిస్తున్న సహకారం ప్రభుత్వంపై ఉన్న విశ్వాసానికి నిదర్శనమని చెప్పారు. అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం పెరుగుతోందని వివరించారు. పార్టీ క్రమశిక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండదని చంద్రబాబు స్పష్టం చేశారు. సాధారణ కార్యకర్త నుంచి అగ్రనేత వరకు అందరికీ పార్టీనే సర్వోన్నతమని పేర్కొన్నారు. కార్యకర్తలను నిర్లక్ష్యం చేసే వారిపైనా, పార్టీ విధానాలకు వ్యతిరేకంగా వ్యవహరించే వారిపైనా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రానున్న ఎన్నికల్లో ప్రతి బూత్‌లో గతం కంటే ఎక్కువ ఓట్లు సాధించే లక్ష్యంతో పనిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

## కల్వకుర్తి పంపులు ఆన్

మొదటి పేజీ తరువాయి

చేసిన ఇంజినీరింగ్ ఆఫీసర్లు ఎల్లూరు రిజర్వాయర్‌నుంచి సింగోటం, జొన్నలబొగడ, గుడిపల్లిగట్టు రిజర్వాయర్లకు నీటిని ఎత్తిపోస్తున్నారు. దీంతో జిల్లాలో 4.50 లక్షల ఎకరాల పంటల సాగుపై ఆశలు చిగురిస్తున్నాయి. కానీ కేఎల్ఐ పరిధిలోని నాగర్ కర్నూల్, వనపర్తి, మహబూబ్ నగర్ జిల్లాల్లో ఆయకట్టుకు సాగునీరందించేందుకు నాలుగు రిజర్వాయర్లతో పాటు దాదాపు 800పైగా పెద్ద చెరువులు నింపాల్సి ఉంటుంది. కృష్ణా నదికి వరద మొదలైన వారం తర్వాత ఎల్లూరు మొదటి పంపును ప్రారంభించి రోజు 800 క్యూసెక్కుల నీటిని లిఫ్ట్ చేస్తున్నారు. తక్కువ వర్షపాతం నమోదైన ప్రాంతాల్లో కేఎల్ఐ కాల్వల ద్వారా సాగునీరందించేందుకు అవకాశాలున్నా.. అధికారులు రెండో పంప్ వినియోగంపై స్పందించడం లేదు. ఎల్లూరులో రెండు పంపుల ద్వారా 1600 క్యూసెక్కుల నీరు ఎత్తిపోస్తే తప్ప కల్వకుర్తి, అచ్చంపేట, వనపర్తి నియోజకవర్గాల్లోని చివరి ఆయకట్టుకు నీరు అందే పరిస్థితి ఉండదు. శ్రీశైలం రిజర్వాయర్ లో 850 అడుగుల వద్దకు నీరు చేరగానే ఏపీ వైపు పోతిరెడ్డిపాడు ఇతర ప్రాజెక్టులకు నీరు వదులుతున్నా.. తెలంగాణ వైపున్న కేఎల్ఐ వంటి మేజర్ ప్రాజెక్టు పరిధిలోని రిజర్వాయర్లు, చెరువులు నింపడంపై అటు ప్రజాప్రతినిధులు, ఇటు ఇంజినీరింగ్ ఆఫీసర్లు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

## ఇందిరమ్మ ఇండ్లకు భారీ స్పందన

మొదటి పేజీ తరువాయి

అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఒక లక్ష ఇళ్ల నిర్మాణ లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. తొలి దశలో పైలట్ ప్రాజెక్టుగా 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 500 చొప్పున ఫ్లాట్ల నిర్మాణాన్ని చేపడుతున్నారు. అభివృద్ధి చెందిన ప్రాంతాల్లోనే ఈ గృహ సముదాయాలను నిర్మించడం ద్వారా పేదలకు నగర ప్రాంతాల్లోనే సొంత నివాసం కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని అధికారులు తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో రూ.30 లక్షల నుంచి రూ.58 లక్షల వరకు విలువ చేసే ఫ్లాట్లను కేవలం రూ.6 లక్షలకే అందిస్తున్నట్లు హౌసింగ్ బోర్డు పేర్కొంది. పేద కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు సొంత ఇంటి కలను తక్కువ వ్యయంతో నెరవేర్చాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని రూపొందించినట్లు వివరించింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఇంత పెద్ద స్థాయిలో నగర ప్రాంతాల్లో పేదల కోసం ప్రత్యేక గృహ నిర్మాణ పథకం చేపట్టడం ఇదే తొలిసారి అని అధికారులు తెలిపారు. ఈ పథకంలో దరఖాస్తు చేసుకునే సమయంలో కుల, ఆదాయ ధ్రువపత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదని గౌతం స్పష్టం చేశారు. దరఖాస్తు సమయంలో చెల్లించే రూ.10 వేల ధరావతు రుసుమును ఇల్లు కేటాయించని పక్షంలో పూర్తిగా తిరిగి చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా లబ్ధిదారులకు ఫ్లాట్లపై పూర్తి రిజిస్ట్రేషన్ సౌకర్యం కూడా కల్పించనున్నట్లు తెలిపారు.

## 17 నుంచి ఎపి శాసనభ సమావేశాలు

మొదటి పేజీ తరువాయి

నోటిఫికేషన్ విడుదల చేశారు. శాసనసభ, శాసనమండలి సెషన్ సమావేశానికి అధికారిక నోటిఫికేషన్ జారీ చేశారు. నాలుగు రోజుల పాటు 50వ వర్షాకాల సమావేశాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. 17వ తేదీ ఉదయం 9 గంటలకు ఏపీ అసెంబ్లీ సమావేశాలు మొదలవుతాయని నోటిఫికేషన్‌లో గవర్నర్ పేర్కొన్నారు.

## 'పెద్ది' కుటుంబానికి రూ.2.25 కోట్లు

మొదటి పేజీ తరువాయి

చెరో కోటి రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించారు. అదే సమయంలో పెద్ది సుదర్శన్ రెడ్డి తల్లి అమృతమ్మ వృద్ధాప్యంలో ఉన్నందున వారి బాగోగుల కోసం మరో రూ. 25 లక్షలను తల్లి పేరు మీద బ్యాంకులో జమ చేయాలని కేసీఆర్ నిర్ణయించారు. మొత్తంగా రూ.2 కోట్ల 25 లక్షల రూపాయలను పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందించి అండగా నిలవాలని బీఆర్ఎస్ నిర్ణయం తీసుకుంది. పిల్లల భవిష్యత్తు, వారి చదువు తదితర కుటుంబ సంక్షేమానికి సంబంధించి పార్టీ నిరంతరం పర్యవేక్షిస్తూ అండగా నిలుస్తుందని కేసీఆర్ పేర్కొన్నారు.

## నాగార్జునసాగర్ నీరు తాగునీటికే..

మొదటి పేజీ తరువాయి

మంత్రి హెచ్చరించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గిపోయాయని, బోర్లలో కూడా భూగర్భ జలాలు క్షీణిస్తున్నాయని చెప్పారు. ఈ పరిస్థితుల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులకు అండగా నిలబడి పంటల మార్పిడిపై అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో ఇప్పటికే 33 వేల ఎకరాల్లో వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేసినట్లు వెల్లడించిన మంత్రి, దీన్ని లక్షన్నర ఎకరాలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకోవాలని అధికారులను ఆదేశించారు. కూరగాయలు, ఉద్యాన పంటలు, చిరుధాన్యాలు వంటి పంటలను ప్రోత్సహించాలని, సేంద్రియ వ్యవసాయంపై రైతులను చైతన్యపరచాలని సూచించారు. జిల్లాకు అవసరమైన 5 వేల స్ప్రింక్లర్ల మంజూరుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జిల్లాకు శాశ్వత సాగునీటి పరిష్కారంగా ఎస్ఎల్బీసీ సొరంగం పనులను ఆగస్టు 2028 నాటికి పూర్తి చేస్తామని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధుల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని చెప్పారు. ఎస్ఎల్బీసీ, ఏఎంఆర్‌పీ, బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టుల ద్వారా భవిష్యత్తులో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తదితరులు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం కారణంగా రాబోయే రోజుల్లో నీటి కొరత మరింత తీవ్రం కావచ్చని అభిప్రాయపడ్డారు. రైతులు ఆగస్టు 15లోపు ఆరుతడి పంటల సాగు చేపట్టేలా వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు గ్రామాల స్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు.

## నీటి హక్కుల పరిరక్షణకు పోరాటం

మొదటి పేజీ తరువాయి

ముఖ్యంగా సాగునీరు, విద్యుత్, రైతాంగ సమస్యల విషయంలో ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత అధికార పార్టీపై ఉందన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను పక్కనబెట్టి రాజకీయాలకే పరిమితమవుతున్న ప్రభుత్వ తీరును ప్రజలు గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్వహించిన యాగాలపై జరుగుతున్న విమర్శలను ప్రస్తావిస్తూ, దేశంలో కేసీఆర్ చేసినన్ని యాగాలు మరెవరూ చేసి ఉండరని కేటీఆర్ అన్నారు. యాగాలు, పూజలు అనేవి వ్యక్తిగత విశ్వాసానికి సంబంధించిన అంశాలని, వాటిని రాజకీయ విమర్శల కోసం ఉపయోగించడం తగదన్నారు. దైవబలం కావాలంటే ముందుగా మానవ ప్రయత్నం ఉండాలని, ప్రజల కోసం పనిచేసే సంకల్పంతో పాటు ఆధ్యాత్మిక విశ్వాసాలు కూడా సమాజంలో భాగమేనని పేర్కొన్నారు. యాగాలు నిర్వహించినందుకు విమర్శించడం కాకుండా, ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలని సూచించారు.

కాంగ్రెస్ నాయకులు చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు దేవాలయాలను సందర్శించడం, పూజలు చేయడాన్ని కూడా రాజకీయ అంశంగా మార్చి విమర్శించడం దురదృష్టకరమన్నారు. ప్రజల విశ్వాసాలను గౌరవించాల్సిన బాధ్యత రాజకీయ నాయకులపై ఉందని, మతపరమైన కార్యక్రమాలను కూడా రాజకీయ కోణంలో చూడడం సమంజసం కాదన్నారు. ప్రజా సమస్యలను పక్కనబెట్టి ఇలాంటి అంశాలపై రాజకీయ విమర్శలు చేయడం కాంగ్రెస్ నాయకుల అసహనాన్ని సూచిస్తోందని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. వ్యవసాయం, సాగునీరు, రైతాంగ సమస్యలపై ముఖ్యమంత్రికి సరైన అవగాహన లేదని ఆరోపించారు. పాలమూరు ప్రాంతానికి చెందిన వ్యక్తినని చెప్పుకునే ముఖ్యమంత్రి, అదే ప్రాంతానికి సాగునీరు అందించే విషయంలో విఫలమయ్యారని అన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదని విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టుల పూర్తి, రైతులకు నీటి అందుబాటు, పంటల రక్షణ వంటి అంశాల్లో స్పష్టమైన కార్యాచరణ కనిపించడం లేదని అన్నారు.

రాష్ట్ర నీటి హక్కుల విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యమే అత్యంత ఆందోళన కలిగించే అంశమని కేటీఆర్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని తరలిస్తుంటే తెలంగాణ ప్రభుత్వం ఏమి చేస్తోందని ప్రశ్నించారు. గోదావరి నదీ నిర్వహణ బోర్డు సమావేశాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఏమిటో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు కేటాయించిన నీటి వాటాను రక్షించేందుకు ప్రభుత్వం చురుకుగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. నీటి హక్కులు అనేవి కేవలం రాజకీయ అంశం కాదని, కోట్లాది మంది రైతుల జీవనాధారానికి సంబంధించిన కీలక అంశమని గుర్తుచేశారు. విద్యుత్ సరఫరాపైనా కేటీఆర్ ప్రశ్నలు లేవనెత్తారు. రాష్ట్రంలో 24 గంటల పాటు నిరంతరాయ విద్యుత్ సరఫరా అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతోందని, అది నిజమైతే ఆధారాలతో నిరూపించాలని సవాల్ విసిరారు.

శ్వేత

# సంపాదకీయం

**శనివారం 8-8-2026**

## బొద్దింకల వేటలో రాహుల్!

బొద్దింకలను బుట్టలో వేసుకోవడమెలా? ఇప్పుడు ఇదే ఆలోచనతో కాంగ్రెస్ అప్రకటిత అగ్రనేత రాహుల్ గాంధీ తన  ప్రయత్నంలో తను ఉన్నారని చెప్పాలి. బొద్దింకలకు మద్దతుగా ఆయన కార్యక్రమాలు చేస్తున్నారు. నిజానికి ఈ బొద్దింకల వెనక కాంగ్రెస్ పార్టీ కూడా ఉందన్న టాక్ ఒకటి రాజధానిలో చక్కర్లు కొడుతోంది. మోడీని పడగొట్టాలంటే రాహుల్‌తో కావడం లేదు. ఆయన జనం దగ్గర పెద్దగా ప్రతిష్టను సంపాదించలేకపోయారు. యూపిఎ ప్రభుత్వం ఓడినప్పటి నుంచి నానా కష్టాలు పడ్డా లాభం లేకుండా పోతోంది. రాజ్యాంగం ప్రమాదంలో పడిందని, రిజర్వేషన్లు ఎత్తేస్తారని బాగా ప్రచారం చేయడంతో గత పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ కొంత పుంజుకుంది. అయితే ఇది రాహుల్ నాయకత్వాన్ని పుంజుకునేంతగా మాత్రం కాదు. ఇప్పుడు ఇటీవల దేశంలో ఓ కుదుపు  కుదిపిన బొదింకలను బుట్టలో వేసుకునే ప్రయత్నం లో ఉన్నారు. వారి ఆందోళనకు మద్దతుగా పార్లమెంట్‌లో పోరాడుతున్నారు. అలాగే వారితో కలసి పని చేసేందుకు ఉత్సాహ పడుతున్నారు. ఇటీవల ఉద్యమంలో పాల్గొన్న కొందరు విద్యార్థులతో కలసి మీడియా ముందుకు వచ్చారు. ప్రయాగ్ రాజ్‌లో జెన్‌జీలతో కలసి ఆందోళనకు పిలుపునిచ్చారు. ఇవన్నీ కూడా ఓ క్రమపద్దతిలో మోడీని ఢీకొనేందుకు చేస్తున్న ప్రయత్నాలుగా గుర్తించాలి. తాజాగా రైతులు కూడా మళ్లీ రోడ్డెక్కబోతున్నారు. ఈ ఇద్దరిని కలిపితే వాలిలా తన బలం కూడా పెరుగుతుందని భావిస్తున్నట్లుగా ఉంది. ఇకపోతే ఇటీవల రాహుల్ తన ఆహార్యాన్ని కూడా మార్చారు. జీన్స్, టి షర్ట్‌తోనే ఎక్కువగా కనిపిస్తున్నారు. ఖద్దరు బట్టలను ఉత్తికి అవతల పడేశారు. యువతరం మనసులో ఏముందో గుర్తించి అందుకు అనుగుణంగా పార్టీ విధానాలు, నినాదాలను సవరించుకుంటేనే భవిష్యత్తు ఉంటుందని భావిస్తున్నారు. తమిళనాడు ఎన్నికల ఫలితందీనిని  రుజువు చేస్తోంది. ఎన్నికలు రాగానే సరికొత్త సంక్షేమ పథకాలను ప్రకటించి ఓటర్లకు డబ్బు పంచితే చాలన్న భావన ఇప్పటివరకు ఉండేది. తమిళనాడు ఎన్నికలు ఇందుకు భిన్నంగా ఫలితాలను ఇచ్చాయి.

టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ డబ్బు పంచకుండాఇ, పెద్దగా ప్రకటనలు చేయకుండా ద్రవిడ పార్టీలను దెబ్బతీసారు. తమిళనాడులో యువతను ఆకట్టుకోవడం ద్వారా విజయ్ అధికారంలోకి వచ్చారు. విజయ్ కూడా ద్రవిడ పార్టీలతో పోటీపడి సంక్షేమ పథకాలు ప్రకటించినా ప్రజలు వాటి గురించి పట్టించుకోలేదు. నిజానికి నేటి తరానికి చెందిన యువత కేవలం సంక్షేమ పథకాలను మాత్రమే కోరుకోవడం లేదు. ప్రభుత్వంలో జవాబుదారీతనం కోరుకుంటున్నారు. ఢిల్లీ నుంచి గల్లీ దాకా వివిధ స్థాయిల్లో జవాబుదారీతనం ఇప్పుడు లోపించింది. అధికార దుర్వినియోగం పెచ్చరిల్లింది. పాలకులు విలాసాలు పెరిగాయి. ప్రభుత్వాలలో ఏ స్థాయిలో కూడా జవాబుదారీతనం కనిపించడం లేదు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఏ ఒక్క ఫైలు కూడా దానంతట అది కదిలే పరిస్థితి లేదు. లంచం ఇవ్వనిదే కాగితం కదలని పరిస్థితి. ఈ కారణంగానే ఈ దేశ యువతలో ఆశలు, ఆకాంక్షలతో పాటు నిరాశా నిస్పృహలు చోటుచేసు కుంటున్నాయి. అందుకే అవకాశం రాగానే మార్పును ఆహ్వానిస్తున్నారు. పరీక్షా పేపర్ల లీక్ విషయంలో మోడీ ప్రభుత్వం నిర్లక్ష్యంగానే వ్యవహరించింది. తాము చేసే పనులే మంచివనే పరిస్థితికి మోడీ వచ్చేశారు. అందుకే ఆయన ప్రజల గుండెచప్పుడు వినలేకపోతున్నారు. జెన్‌జీ లంతా బొద్దింకల రూపంలో నిరసనలు తెలపడంతో కొంత సర్దుకున్నా, పూర్తిగా సర్దుకునేందుకు సిద్దం కావడం లేదు. దీన్ని అవకాశంగా తీసుకుని రాహుల్ దూకుడు ప్రదర్శిస్తున్నారు.

అందుకే దేశంలోని రాజకీయ పార్టీలు బొద్దింకల పేరు ఎత్తగానే భయపడుతున్నాయి. నిన్నటి తరం ఆలోచనలతో, పాత చింతకాయ పచ్చడి విధానాలతో నడుస్తున్న పార్టీలకు ఎన్నికలలో నవతరం నుంచి ప్రతిఘటన ఎదురవుతోంది. యువతరంలో ఆశలు,ఆకాంక్షలు పెరుగుతున్న సమయంలోనే నిరాశా నిస్పృహలు కూడా వారిని కమ్మేస్తున్నాయి. బొద్దింకల ఢిల్లీ ఆందోళన ఇందుకు తాజా ఉదాహరణ. ఈ బొద్దింకలను పట్టేస్తే..మనకు తిరుగు లేదని అందరూ ఆలోచన చేస్తున్నారు. రాహుల్ గాంధీ ఓ అడుగు ముందుకు వేసి వారికి మద్దతుగా పోరాట పంథా అవలంబిస్తున్నారు. పార్లమెంట్ లోపలా, బయటా ఇప్పుడు, విద్యార్థులు, యువత గురించి గట్టిగా మాట్లాడు తున్నారు. యువతరంతో కనెక్ట్ కాని పార్టీలు మెల్లగా తెరమరుగవుతాయని గుర్తించారు. ప్రధాని మోదీ కూడా సామాజిక మాధ్యమాల్లో యువతరం వెలిబుచ్చుతున్న అభిప్రాయాలను ఎప్పటికప్పుడు తెలుసుకొని తదనుగుణంగా వ్యూహాలు రూపొందించుకోవాలని పార్టీ నాయకులకు దిశా నిర్దేశం చేశారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ ఘావత్ కూడా ఇదే విషయాన్ని ప్రకటించారు. స్వాతంత్ర్య సంగ్రామాన్ని ముందుండి నడిపించిన కాంగ్రెస్ పార్టీ... ఆ తర్వాత దేశాన్ని సుదీర్ఘ కాలం పరిపాలించింది. తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నుంచి లాల్‌బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ, పీవీ నరసింహారావు, మన్మోహన్‌సింగ్ కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రధానమంత్రులుగా పనిచేశారు. కాంగ్రెస్ నాయకుల పెడ ధోరణులు కారణంగా నేటి తరానికి దూరం అయ్యారు. పార్టీని ఎప్పటికప్పుడు యువతతో కనెక్ట్ చేసుకునే పనిని కాంగ్రెస్ నాయకులు చేయలేదు. విధానాలను, ఆలోచనలను సవరించుకొని నవీకరించుకోవడంలేదు.  డెబ్బై అయిదేళ్లు పైబడిన ప్రధాని నరేంద్ర మోదీ ఈ దేశం యువతతో కనెక్ట్ అవుతుండగా... వయసులో చిన్నవాడైన రాహుల్‌గాంధీ యువతను ఆకట్టుకోలేకపోయారు. ఆలస్యంగా అయినా ఇప్పుడు రాహుల్ యువత గురించి ఆలోచి స్తున్నారు. అయితే బొద్దింకల పార్టీ రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించింది. కేవలం ప్రెజర్ గ్రూపుగా పనిచేస్తామని అభిజిత్ దీప్కే ప్రకటించారు. ఈ క్రమంలో రాహుల్ బుట్టలో పడతారా  లేక సొంతగా తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తారా అన్నది ముమ్మందు తేలనుంది. ఓ వైపు రాజ్యాంగం బుక్, మరోవైపు బొద్దింకల ఎజెండాతో ముందుకు సాగడం ద్వారా జాతీయ స్థాయిలో విజయం సాధించి అధికారం చేపట్టాలన్న లక్ష్యంతో రాహుల్ సాగుతున్నారు.

## అరుణాచల్‌పై చైనా కుట్రలకు చెక్

**అరుణాచల్ మ్యాప్‌ను విడుదల చేసిన భారత్**

న్యూఢిల్లీ,ఆగస్ట్8:  భారత్‌లోని అరుణాచల్ ప్రదేశ్‌లో పలు ప్రాంతాలను తమవిగా చెప్పుకునే చైనాకు భారత్ గట్టి కౌంటర్ ఇచ్చింది. ఆ రాష్ట్రంలోని నాలుగు మౌంటెయిన్ పాస్‌లు, ఒక సరస్సు సహా 27 కీలక ప్రాంతాలతో కూడిన సవివరమైన ప్రామాణిక మ్యాప్‌ను సర్వే ఆఫ్ ఇండియా విడుదల చేసింది. ఇరు దేశాల మధ్య సరిహద్దుకు సంబంధించి పూర్తి క్లారిటీతో ఈ మ్యాప్‌ను విడుదల చేసింది. అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపుల తరువాత ఈ మ్యాప్‌ను ఖరారు చేసినట్టు హోంశాఖ తెలిపింది. తాజా మ్యాప్‌తో ప్రజలకు మరింత అవగాహన పెరుగుతుందని సర్వే ఆఫ్ ఇండియా చెప్పింది. మ్యాప్‌లో తాజాగా చేర్చిన 27 ప్రాంతాల్లో సరిహద్దున ఉన్న మూడు ప్రాంతాలకు (సుబన్‌సిరి జిల్లా) వ్యూహాత్మక ప్రాధాన్యం ఉంది. అదే జిల్లాలోని నాలుగు మౌంటెయిన్ పాస్‌లను కూడా మ్యాప్‌లో చూపించారు. ఈ ప్రాంతాలన్నీ మిలిటరీ మ్యాపుల్లో ఇప్పటికే అందుబాటులో ఉన్నప్పటికీ సర్వే ఆఫ్ ఇండియా మ్యాపులో వీటిని స్పష్టంగా చూపించడమంటే చైనాకు గట్టి కౌంటర్ ఇచ్చినట్టేనని సంబంధిత వర్గాలు తెలిపాయి. మ్యాపులో చూపించిన పలు ప్రాంతాల్లో చైనా, భారత్ దళాల మధ్య ఘర్షణలు జరిగాయి. అరుణాచల్ ప్రదేశ్‌ను దక్షిణ టిబెట్ అని పిలిచే చైనా ఆ రాష్ట్రంలోని 23 ప్రాంతాలకు కొత్త పేర్లను ఖరారు చేస్తూ ఒక ప్రకటన విడుదల చేసిన విషయం తెలిసిందే. అయితే, ఈ చర్యలతో క్షేత్రస్థాయిలో ఎలాంటి మార్పులు ఉండవని చైనాకు భారత్ అప్పట్లోనే గట్టి కౌంటర్ ఇచ్చింది. అరుణాచల్ ప్రదేశ్ ఎప్పటికీ భారత్‌లో భాగంగానే ఉంటుందని స్పష్టం చేసింది. చైనా, భారత్‌ల మధ్య సరిహద్దు రేఖ మెక్‌మెహన్ లైన్ టిబెట్, అరుణాచల్ ప్రదేశ్‌ను వేరు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో అరుణాచల్ ప్రదేశ్‌లో 27 ప్రదేశాలకు భారత్ కొత్త పేర్లను పెట్టింది. కొన్ని ప్రదేశాలకు చైనా పేర్లు పెడుతున్న నేపథ్యంలో.. దానికి కౌంటర్‌గా ఇండియా కూడా కొత్త పేర్లను ఖరారు చేసింది. భారతీయ మ్యాప్‌లో సుమారు 27 ప్రదేశాలను గుర్తించి .. వాటికి ఇండియా కొత్త పేర్లను పెట్టింది. అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్‌లో ఆ ప్రదేశాలను గుర్తించారు. స్థానికులు గుర్తుపట్టే రీతిలో ఆ పేర్లను పెట్టినట్లు ప్రకటనలో తెలిపారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని కొన్ని ప్రదేశాలకు చైనా పేర్లు పెట్టడాన్ని భారత్ వ్యతిరేకించిన విషయం తెలిసిందే. వాస్తవాధీన రేఖ వెంట ఉన్న లాంగ్ జూ ప్రాంతం కూడా కొత్తగా పేరు పెట్టిన ప్రదేశంలో ఉన్నది. ఇక్కడే 1959లో ఇండియా, చైనా మధ్య ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈ ప్రాంతంలోకి చైనా దళాలు ఎంటర్ అయ్యాయి. లాంగ్ జూ సమీపంలో ఉన్న మాజా అనే గ్రామాన్ని కూడా కొత్త మ్యాప్‌లో మార్క్ చేశారు. ఇది అప్పర్ సుబన్‌సిరి జిల్లాలో ఉన్నది. పర్వత ప్రాంతాలైన జో లా, రిజా లా, పుకుర్ లాతో పాటు బిసా గ్రామం కూడా కొత్త లిస్టులో ఉన్నది. హై ఆల్టిట్యూడ్ పాసేజ్‌లో థాగ్ లా ఉన్నది. 1962లో ఇదే ప్రాంతంలో భారత్, చైనా మధ్య ఘర్షణ జరిగింది. ప్రస్తుతం ఈ ప్రాంతాన్ని కూడా అధికారికంగా మ్యాప్‌లో గుర్తించారు. చాంగ్‌లాంగ్ జిల్లాలో ఉన్న జైరాంపూర్‌ను కూడా లిస్టులో పెట్టారు. సాంబో సరోవర్, బారా కుందన్, చోటా కుందన్, దాన్ బారి, ప్రిత్‌నగర్, తెరిత్నగర్, రామ్‌నగర్, జశ్వంత్ ఘర్, సాగర్, పద్మ, జ్యోతినగర్, బైసాకి ప్రాంతాలు కొత్త లిస్టులో ఉన్నాయి. షేర్ ఏ తప్పా స్మారకం, చోటా రూపక్, బారా రూపక్, శివాజీ నగర్, సున్పురా, కమలాంగ్ నగర్, కమలాంగ్ సాంక్చరీ, బుద్ధామందిర్ కూడా జాబితాలో ఉన్నాయి.

## నీటి హక్కుల పరిరక్షణకు పోరాటం

**తెలంగాణ ఉద్యమ తరహాలో మరో పోరాటానికి పిలుపు**




హైదరాబాద్, ఆగస్టు 8 : రాష్ట్ర ప్రయోజనాలు, ముఖ్యంగా తెలంగాణ నీటి హక్కుల విషయంలో బీఆర్ఎస్ ఎప్పుడూ రాజీ పడదని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. శనివారం మీడియాతో మాట్లాడిన ఆయన రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాలను కాపాడాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ముఖ్యంగా సాగునీరు, విద్యుత్, రైతాంగ సమస్యల విషయంలో ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత అధికార పార్టీపై ఉందన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను పక్కనబెట్టి రాజకీయాలకే పరిమితమవుతున్న ప్రభుత్వ తీరును ప్రజలు గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్వహించిన యాగాలపై జరుగుతున్న విమర్శలను ప్రస్తావిస్తూ, దేశంలో కేసీఆర్ చేసినన్ని యాగాలు మరెవరూ చేసి ఉండరని కేటీఆర్ అన్నారు. యాగాలు, పూజలు అనేవి వ్యక్తిగత విశ్వాసానికి సంబంధించిన అంశాలని, వాటిని రాజకీయ విమర్శల కోసం ఉపయోగించడం తగదన్నారు. దైవబలం కావాలంటే ముందుగా మానవ ప్రయత్నం ఉండాలని, ప్రజల కోసం పనిచేసే సంకల్పంతో పాటు ఆధ్యాత్మిక విశ్వాసాలు కూడా సమాజంలో భాగమేనని పేర్కొన్నారు. యాగాలు నిర్వహించినందుకు విమర్శించడం కాకుండా, ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలని సూచించారు.

కాంగ్రెస్ నాయకులు చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు దేవాలయాలను సందర్శించడం, పూజలు చేయడాన్ని కూడా రాజకీయ అంశంగా మార్చి విమర్శించడం దురదృష్టకరమన్నారు. ప్రజల విశ్వాసాలను గౌరవించాల్సిన బాధ్యత రాజకీయ నాయకులపై ఉందని, మతపరమైన కార్యక్రమాలను కూడా రాజకీయ కోణంలో చూడడం సమంజసం కాదన్నారు. ప్రజా సమస్యలను పక్కనబెట్టి ఇలాంటి అంశాలపై రాజకీయ విమర్శలు చేయడం కాంగ్రెస్ నాయకుల అసహనాన్ని సూచిస్తోందని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. వ్యవసాయం, సాగునీరు, రైతాంగ సమస్యలపై ముఖ్యమంత్రికి సరైన అవగాహన లేదని ఆరోపించారు. పాలమూరు ప్రాంతానికి చెందిన వ్యక్తినని చెప్పుకునే ముఖ్యమంత్రి, అదే ప్రాంతానికి సాగునీరు అందించే విషయంలో విఫలమయ్యారని అన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదని విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టుల పూర్తి, రైతులకు నీటి అందుబాటు, పంటల రక్షణ వంటి అంశాల్లో స్పష్టమైన కార్యాచరణ కనిపించడం లేదని అన్నారు.


రాష్ట్ర నీటి హక్కుల విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యమే అత్యంత ఆందోళన కలిగించే అంశమని కేటీఆర్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని తరలిస్తుంటే తెలంగాణ ప్రభుత్వం ఏమి చేస్తోందని ప్రశ్నించారు. గోదావరి నదీ నిర్వహణ బోర్డు సమావేశాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఏమిటో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు కేటాయించిన నీటి వాటాను రక్షించేందుకు ప్రభుత్వం చురుకుగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. నీటి హక్కులు అనేవి కేవలం రాజకీయ అంశం కాదని, కోట్లాది మంది రైతుల జీవనాధారానికి సంబంధించిన కీలక అంశమని గుర్తుచేశారు. విద్యుత్ సరఫరాపైనా కేటీఆర్ ప్రశ్నలు లేవనెత్తారు. రాష్ట్రంలో 24 గంటల పాటు నిరంతరాయ విద్యుత్ సరఫరా అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతోందని, అది నిజమైతే ఆధారాలతో నిరూపించాలని సవాల్ విసిరారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం విస్మరిస్తోందని ఆరోపించారు. ప్రజలకు అందుతున్న సేవల విషయంలో వాస్తవ పరిస్థితులను ప్రభుత్వం వెల్లడించాలని కోరారు. ప్రచారాల కంటే ప్రజల అనుభవాలే నిజమైన ప్రమాణమని వ్యాఖ్యానించారు.

'హైడ్రా' పేరుతో పేదలపై కక్షసాధింపు చర్యలు జరుగుతున్నాయని కేటీఆర్ ఆరోపించారు. అభివృద్ధి పేరుతో పేదల ఇళ్లను కూల్చివేయడం, వారిని ఇబ్బందులకు గురిచేయడం సమంజసం కాదన్నారు. ప్రజల హక్కులను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని, బలహీన వర్గాలపై ఒత్తిడి తీసుకురావడం సరైన పద్ధతి కాదన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని జరగాలని, పేదల జీవితాలపై ప్రతికూల ప్రభావం పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. తాము అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా తెలంగాణ శ్రేయస్సే తమ లక్ష్యమని కేటీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలు, నీటి హక్కుల పరిరక్షణ కోసం అవసరమైతే తెలంగాణ ఉద్యమ తరహాలో మరో భారీ ప్రజా పోరాటాన్ని చేపడతామని హెచ్చరించారు. కేసీఆర్ నాయకత్వంలో ప్రజలను చైతన్యపరిచి, రాష్ట్ర హక్కుల కోసం ఉద్యమిస్తామని తెలిపారు. తెలంగాణకు సంబంధించిన ప్రతి అంశంలో ప్రజల పక్షాన నిలుస్తామని, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడే పోరాటంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని కేటీఆర్ స్పష్టం చేశారు.

## కేసీఆర్ అండతో పెద్ది కుటుంబానికి భరోసా

**కుటుంబ సంక్షేమానికి బీఆర్ఎస్ భరోసా**

హైదరాబాద్, ఆగస్టు 8 : స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా నిలిచింది. పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఆదేశాల మేరకు కుటుంబానికి మొత్తం రూ.2.25 కోట్ల ఆర్థిక సహాయం అందజేశారు. సుదర్శన్ రెడ్డి కుటుంబ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఆయన ఇద్దరు పిల్లలకు చెరో రూ.1 కోటి చొప్పున ఆర్థిక సాయం అందించారు. వారి విద్యాభ్యాసం, భవిష్యత్తు అవసరాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈ సహాయం ఉపయోగపడనుంది. అదే విధంగా సుదర్శన్ రెడ్డి తల్లి అమృతమ్మ సంక్షేమం కోసం రూ.25 లక్షలను బ్యాంకులో జమ చేసినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. పిల్లల చదువు, ఉన్నత విద్య, భవిష్యత్తు లక్ష్యాల సాధనకు అవసరమైన అన్ని విధాలా సహకారం అందిస్తామని బీఆర్ఎస్ నాయకత్వం స్పష్టం చేసింది. కుటుంబ సభ్యులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపింది.







# కూటమి ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత

**నారా లోకేష్ గారు నూతన వరవడి**

**చదువుపై ఏకాగ్రత కలిగించాలి.**

**బి స్కూలు భవనం, ఎంఈఓ కార్యాలయం ప్రారంభం**

**మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు**

గజపతినగరం, ఆగస్టు 8,

కూటమి ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత కల్పిస్తుందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం గజపతినగరం నియోజకవర్గం దత్తిరాజేరు మండల కేంద్రంలో 2 కోట్ల 12 లక్షల రూపాయలతో నిర్మించిన కస్తూరిబా బాలికల అప్గ్రేడ్ జూనియర్ కళాశాల భవన సముదాయాన్ని, 53 లక్షల రూపాయలతో నిర్మించిన మండల విద్యాశాఖ అధికారి భవన సముదాయాన్ని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలనే సంకల్పంతో పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. పాఠశాల ప్రారంభ సమయంలోనే యూనిఫామ్, షూస్, పుస్తకాలు అందించడంతోపాటు, డొక్కా సీతమ్మ పేరిట నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించడం జరుగుతుందన్నారు.

విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారి సారథ్యంలో నూతన వరవడితో ఒక ప్రణాళిక బద్ధంగా చిన్నారులకు తర్ఫీదును అందించడంతోనే 2025-2026 సంవత్సరంలో పదవ తరగతి పరీక్షా ఫలితాలలో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు సత్తా చాటటం జరిగిందన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులకు చదువుపై ఏకాగ్రత కలిగించాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో అవగాహన కలిగేలా నేర్పరితనంతో, పాఠ్యాంశాలను బోధించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి నేతృత్వంలో కూటమి ప్రభుత్వం పాఠశాలల్లో కావలసిన అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడంతోపాటు తల్లికి వందనం అందజేసి విద్యార్థులను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. మెరుగైన వసతులు కల్పించడంలో భాగంగా స్కూలు భవనం విద్యా వనరుల కేంద్రం భవనాలు ప్రారంభించటం జరిగిందన్నారు. విద్యార్థులు సైతం చదువుపై ఏకాగ్రతతో ముందుకు సాగాలని, చదువు ద్వారా కుటుంబ ఆర్థిక పరిస్థితులు మెరుగుపరుచుకోవచ్చని, ప్రణాళికా బద్ధంగా చదువుకుని మంచి భవిష్యత్తును పొందాలని సూచించారు. కస్తూరిబా బాలికలతో పాఠశాల గదులను రిబ్బన్ కట్ చేయించి చిన్నారుల హర్షధ్వానాల మధ్య మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు ప్రారంభించారు. విద్యార్థుల బాగోగులు, పాఠశాల ఉపాధ్యాయుల పనితీరు, భోజనాల రుచి, మౌలిక వసతులు గురించి మంత్రి కొండపల్లి అడిగి తెలుసుకున్నారు. పాఠశాల నూతన భవన ప్రారంభం సందర్భంగా ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, కూటమి నాయకులు గ్రామ పెద్దలు విద్యార్థులు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారికి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి, ఏఎంసీ చైర్మన్ పివివి గోపాలరాజు, బిజెపి నాయకులు రెడ్డి పావని, మండల పార్టీ అధ్యక్షులు చప్పా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.




## ఏపీటీడీసీ ఆధ్వర్యంలో విజయవాడ - వాడపల్లి- విజయవాడ ఒక రోజు టూర్ ప్యాకేజీ ప్రారంభం

**జండా ఊపి ప్రారంభించిన ఏపీటీడీసీ జనరల్ మేనేజర్ టి.ఎస్.వి. నారాయణ**

రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ఆధ్వర్యంలో విజయవాడ- వాడపల్లి - విజయవాడ వాహన బస్సును శనివారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ ఎదురుగా ఉన్న సెంట్రల్ రిజర్వేషన్ ఆఫీస్ కేంద్రం వద్ద ఏపీటీడీసీ జనరల్ మేనేజర్ టి.ఎస్.వి. నారాయణ లాంఛనంగా ప్రారంభించారు. భక్తులకు, పర్యాటకులకు అధునాతన సౌకర్యవంతమైన రవాణా, ఆహార వసతులతో ప్రణాళికాబద్ధమైన తీర్థయాత్ర అనుభవాన్ని అందించటంలో భాగంగా ప్యాకేజీని రూపకల్పన చేసినట్లు ఆయన అన్నారు. ప్రతీ శనివారం ఉదయం 4 గంటలకు ప్రారంభమై రాత్రి 7 గంటలకు తిరిగి విజయవాడ చేరుకుంటామన్నారు. ప్యాకేజీ ధర పెద్దలకు రూ. 1,160/-, పిల్లలకు రూ. 1,000/- గా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ రుసుములో సౌకర్యవంతమైన బస్సు రవాణా ఛార్జీలతో పాటు ఉదయం అల్పాహారం మరియు మధ్యాహ్న భోజన వసతి కలిగి ఉంటాయని అన్నారు. ఆలయ దర్శనం టికెట్ ఛార్జీలను పర్యాటకులే స్వయంగా భరించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. ప్రత్యేక యాత్రను సద్వినియోగం చేసుకోవాలనుకునే భక్తులు మరియు పర్యాటకులు ఝఝ.ఖజూఎ.స్త్రశీజ.ఱఅ వెబ్సైట్ ద్వారా ఆన్లైన్లో గానీ, లేదా విజయవాడ బందర్ రోడ్, లెమన్ ట్రీ హోటల్ పక్కన ఉన్న సెంట్రల్ రిజర్వేషన్ ఆఫీస్ (జ=ా) వద్ద నేరుగా సంప్రదించి తమ సీట్లను ముందుగానే బుక్ చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ లిమిటెడ్ జనరల్ మేనేజర్ టి ఎస్ వి నారాయణ తెలిపారు.

## స్వచ్ఛ భారత్ మిషన్‌పై విజయవాడలో జిల్లా స్థాయి వర్క్‌షాప్

విజయవాడ, ఆగస్టు 08, 2026: స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ్) కార్యక్రమం అమలు, గ్రామీణ పారిశుధ్యం, ఘన--ద్రవ వ్యర్థాల నిర్వహణ తదితర అంశాలపై కృష్ణా మరియు ఎన్టీఆర్ జిల్లాలకు సంబంధించిన జిల్లా స్థాయి వర్క్‌షాప్‌ను విజయవాడ తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌కు కృష్ణా మరియు ఎన్టీఆర్ జిల్లాల నుండి డీడీఓలు, డీఎల్‌పీఓలు, ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలు మరియు పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్--× నుంచి గ్రేడ్--ఎ వరకు అధికారులు, సిబ్బంది హాజరయ్యారు. పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు కమిషనర్ ఎం.సుధాకర్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌లో స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ్) లక్ష్యాలు, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ, ఘన--ద్రవ వ్యర్థాల సమర్థవంతమైన నిర్వహణ, కార్యక్రమాల అమలు, పర్యవేక్షణ తదితర అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కృష్ణా జిల్లా ప్రజా పరిషత్ కార్యనిర్వహణాధికారి డాక్టర్ జె. అరుణ, కృష్ణా జిల్లా పంచాయతీ అధికారి ఎం. ధనలక్ష్మి, ఎన్టీఆర్ జిల్లా పంచాయతీ అధికారి సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛత, పారిశుధ్య ప్రమాణాలను మరింత మెరుగుపరచడంతో పాటు, స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ్) కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి, స్వచ్ఛమైన మరియు ఆరోగ్యకరమైన గ్రామాల నిర్మాణానికి కృషి చేయాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు.











# రైజ్ రెక్కలతో మహిళల విజయ విహంగం

**విజయవంతంగా నడుస్తున్న పారిశ్రామిక యూనిట్లు**

**ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త దార్శనికత దిశగా అడుగులు**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

మహిళల్లో దాగిఉన్న వ్యాపార నైపుణ్యాలను వెలికితీసి, వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే దిశగా రైజ్ కేంద్రం విశేషంగా కృషిచేస్తోందని.. గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల మహిళలకు అవసరమైన శిక్షణ, మార్గదర్శకత్వం, సాంకేతిక సహకారం, మార్కెటింగ్ అవకాశాలను అందిస్తూ రైజ్ కేంద్రం ఒక ప్రత్యేక గ్రామీణ ఇంక్యుబేషన్ సెంటర్‌గా ఎదుగుతోందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. శనివారం ఇబ్రహీంపట్నం మండలం, గుంటుపల్లి రైజ్ కేంద్రంలో జరిగిన సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్‌పోను కలెక్టర్ లక్ష్మీశ సందర్శించారు. రైజ్ కేంద్రం చేయూతతో ఏర్పాటుచేసిన పారిశ్రామిక యూనిట్ల ఉత్పత్తులతో ఏర్పాటుచేసిన 27 స్టాళ్లను పరిశీలించారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధన దిశగా చేస్తున్న ప్రయాణంలో గౌరవ ముఖ్యమంత్రి దార్శనికత అయిన ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త మైలురాయిని చేరుకునేందుకు రైజ్ కేంద్రం కీలక ముందడుగా నిలుస్తోందన్నారు. ఈ కేంద్రంలో ప్రతిరోజూ శిక్షణ కార్యక్రమాలతో పాటు ప్రతి శనివారం వర్క్‌షాప్‌లు, ఎప్పటికప్పుడు జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ విధంగా ఇప్పటికే 30 వర్క్‌షాప్‌లు నిర్వహించామని.. అయిదువేల మంది మహిళలకు చేరువయ్యామని తెలిపారు. వీరిలో ఇప్పటికే చాలామంది పారిశ్రామిక యూనిట్లు ఏర్పాటుచేసి విజయవంతంగా ముందుకెళు_న్నారన్నారు.

లిఆలోచన నుంచి ఆచరణ వరకు:లి

రైజ్ కేంద్రం ద్వారా మహిళలు తమలోని నైపుణ్యాలను ఉపాధి అవకాశాలుగా మలుచుకునేలా ప్రోత్సహించడంతో పాటు, చిన్నస్థాయి వ్యాపారాలను అభివృద్ధి చేసుకునేందుకు అవసరమైన సహకారం అందిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ చెప్పారు. మైక్రో, మినీ ఫుడ్ ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ వంటివాటిలో స్వయం ఉపాధి నుంచి పారిశ్రామికవేత్తలుగా ఎదుగుతున్న మహిళల విజయాలు మరింత మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. మహిళలు ఉద్యోగాల కోసం ఎదురుచూసే స్థాయి నుంచి, ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగేలా రైజ్ కేంద్రం దోహదపడుతోందని అన్నారు. మహిళల ఆర్థిక సాధికారత.. కుటుంబ ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడంతో పాటు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుందని తెలిపారు. స్థానికంగా లభించే వనరులు, నైపుణ్యాలు, మహిళల సామర్థ్యాలను సద్వినియోగం చేసుకుని విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్, బ్రాండింగ్‌పై దృష్టిసారించేలా చేస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పొందిన మహిళలకు బ్యాంకు రుణాలు, ప్రభుత్వ పథకాలు, మార్కెట్ అవకాశాలతో అనుసంధానం కల్పిస్తూ వారి యూనిట్లు స్థిరంగా అభివృద్ధి చెందేలా రైజ్ తోడ్పాటునందిస్తున్నట్లు వివరించారు. సమాజంలో పారిశ్రామికరంగంలో విజయవంతంగా ముందుకెళ్తున్న ఎందరో మహిళలు మార్గదర్శులుగా వ్యవహరిస్తూ పీ4 స్ఫూర్తిని చాటిచెబుతున్నారని, రిసోర్స్ పర్సన్స్‌గా సేవలందిస్తున్నారని వివరించారు.

లిఏఐ వంటి ఆధునిక సాంకేతికతపైనా:లి

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి ఆధునిక సాంకేతికత వినియోగంపైనా శిక్షణ ఇచ్చి, నైపుణ్యాలు అభివృద్ధి చేసి మహిళలు మంచి ఉద్యోగాలు పొందడం రైజ్ కేంద్రం విజయానికి ప్రతీక అని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ), ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికేషన్ తదితరాలపైనా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరికీ ఒక నైపుణ్యం ఉండాలి.. ఆ నైపుణ్యం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన రైజ్ కేంద్రానికి నీతి ఆయోగ్ కూడా మద్దతిస్తోందన్నారు. స్థానిక శాసనసభ్యులు, ఎంపీ కూడా ఈ కేంద్రానికి చేయూతనందిస్తున్నారని.. డీఆర్‌డీఏ, మెప్మా తదితర శాఖ సమన్వయంతో ఈ కేంద్రాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు చేస్తున్న కృషిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విద్యార్హతలతో సంబంధం లేకుండా ఔత్సాహిక మహిళలు ఎవరైనా ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు.

# దుర్గమ్మ జాతరలో ఎమ్మెల్యే చింత ప్రభాకర్



**అమ్మవారికి ప్రత్యేక పూజలు**

**మంచి వర్షాల కోసం ప్రార్థనలు**

**భక్తులతో కలిసి జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే**

**సదాశివపేట, ఆగస్టు 8 :**
సదాశివపేట పట్టణంలో అత్యంత వైభవంగా నిర్వహించిన శ్రీ దుర్గమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల్లో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు, భక్తులు ఘన స్వాగతం పలికారు. జాతరలో భాగంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, శాంతి, సౌభాగ్యాలు కలగాలని అమ్మవారిని ప్రార్థించారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో మంచి వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని ప్రత్యేకంగా ప్రార్థించినట్లు తెలిపారు. వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు. జాతరలో వేలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల భారీ రద్దీ జాతరకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆలయ పరిసరాలు భక్తజన సందోహంతో కళకళలాడాయి. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమాలను ఎమ్మెల్యే పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు, నిర్వాహకులు తీసుకున్న చర్యలను అభినందించారు. ఆధ్యాత్మిక సంప్రదాయాలను కాపాడుతూ ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో జాతరలో పాల్గొనడం ఆనందంగా ఉందని చింత ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నేత ఆరోగ్యంపై హరీశ్ రావు ఆరా



**క్యామ మల్లేశ్‌ను కలిసిన మాజీ మంత్రి**

**త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష**

**హైదరాబాద్, ఆగస్టు 8 :**
ఇటీవల అనారోగ్యానికి గురై శస్త్రచికిత్స చేయించుకున్న బీఆర్ఎస్ సీనియర్ నేత క్యామ మల్లేశ్‌ను మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు పరామర్శించారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డితో కలిసి హైదరాబాద్‌లోని మల్లేశ్ నివాసానికి వెళ్లిన హరీశ్ రావు ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైద్యులు సూచించిన చికిత్స, ప్రస్తుతం కొనసాగుతున్న ఆరోగ్య పరిస్థితిపై కుటుంబ సభ్యులతో చర్చించారు. శస్త్రచికిత్స అనంతరం కోలుకుంటున్న మల్లేశ్ ఆరోగ్యంపై ప్రత్యేకంగా ఆరా తీశారు. వైద్యుల సూచనలను పాటిస్తూ విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ పార్టీకి క్యామ మల్లేశ్ అందించిన సేవలను హరీశ్ రావు గుర్తు చేసుకున్నారు. పార్టీ బలోపేతంలో ఆయన పోషించిన పాత్రను ప్రస్తావిస్తూ త్వరలోనే పూర్తి ఆరోగ్యంతో తిరిగి ప్రజల్లోకి రావాలని ఆకాంక్షించారు. పార్టీ కార్యకలాపాల్లో ఆయన మళ్లీ చురుకుగా పాల్గొనాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కూడా మల్లేశ్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని ధైర్యం చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలందరూ ఆయన త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నారని తెలిపారు. కుటుంబ సభ్యులకు అవసరమైన సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. పరామర్శ సందర్భంగా పార్టీ నాయకులు, స్థానిక కార్యకర్తలు కూడా హాజరయ్యారు. మల్లేశ్ త్వరగా కోలుకుని మునుపటిలా ప్రజాసేవలో కొనసాగాలని వారు ఆకాంక్షించారు. ఆరోగ్య పరిస్థితి మెరుగుపడుతున్నట్లు కుటుంబ సభ్యులు వెల్లడించినట్లు సమాచారం. బీఆర్ఎస్ నాయకత్వం పార్టీ సీనియర్ నేతల ఆరోగ్యం, సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ఈ పరామర్శ మరోసారి స్పష్టం చేసింది. క్యామ మల్లేశ్ సంపూర్ణ ఆరోగ్యంతో త్వరలోనే ప్రజల మధ్యకు రావాలని హరీశ్ రావు ఆకాంక్షించారు.

# మహబూబ్‌నగర్‌లో వర్షాభావంపై సమీక్ష




**ప్రత్యామ్నాయ పంటలకు ప్రోత్సాహం**

**స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీపై దృష్టి**

**వనమహోత్సవం, పెన్షన్ల అమలుపై ఆదేశాలు**

**మహబూబ్‌నగర్, ఆగస్టు 8 :**
రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయం, సంక్షేమ కార్యక్రమాల అమలుపై రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పాల్గొన్నారు. జిల్లా పరిపాలన యంత్రాంగం తరఫున పలు కీలక అంశాలపై సమీక్ష నిర్వహించి, ప్రభుత్వ ఆదేశాలను క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేసే దిశగా చర్చలు జరిపారు. సమావేశంలో ప్రధానంగా వర్షాభావ పరిస్థితుల ప్రభావం, వ్యవసాయ రంగానికి ఎదురవుతున్న సవాళ్లపై చర్చ జరిగింది. నీటి కొరత నేపథ్యంలో అధిక నీటి అవసరం ఉండే వరి సాగును విస్తరించకుండా రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించే చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. తక్కువ నీటితో సాగు చేయగల పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని కూడా సమావేశంలో సమీక్షించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని, పంపిణీ ప్రక్రియలో ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా చేపట్టిన వనమహోత్సవ కార్యక్రమాల పురోగతిని కూడా సమీక్షించారు. జిల్లాలో లక్ష్యాలకు అనుగుణంగా మొక్కల నాటకం, వాటి సంరక్షణ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. నాటిన మొక్కల మనుగడపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. అలాగే సామాజిక భద్రత పథకాల అమలుపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. చేయూత పెన్షన్ల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేసి అర్హులైన లబ్ధిదారులకు ఎలాంటి ఆలస్యం లేకుండా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో పెన్షన్ లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా స్థానిక అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యంగా భావిస్తున్న వ్యవసాయం, సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను సమన్వయంతో అమలు చేయాలని వీడియో కాన్ఫరెన్స్‌లో స్పష్టం చేశారు. వర్షాభావ పరిస్థితుల ప్రభావాన్ని తగ్గించేందుకు ముందస్తు ప్రణాళికలతో పనిచేస్తూ రైతులకు, ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టాలని అధికారులకు సూచనలు జారీ అయ్యాయి.



# ఎస్.ఆర్. నాయక్ నగర్ అభివృద్ధికి ప్రజల సహకారం కీలకం

**నూతన సంక్షేమ సంఘం సభ్యుల మర్యాదపూర్వక భేటీ**

**మరిన్ని మౌలిక వసతుల కల్పనకు హామీ**

**హైదరాబాద్, ఆగస్టు 8 :**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని 130వ డివిజన్ సుభాష్‌నగర్‌లో ఉన్న ఎస్.ఆర్. నాయక్ నగర్ నూతన సంక్షేమ సంఘం సభ్యులు బీఆర్ఎస్ శాసనసభ పక్ష విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో కాలనీ అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై చర్చించారు. గత పన్నెండు సంవత్సరాల కాలంలో కాలనీలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంఘం సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి కార్యక్రమాల వల్ల ఎస్.ఆర్. నాయక్ నగర్ రూపురేఖలు మారాయని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మౌలిక వసతులు, రహదారులు, పారిశుద్ధ్య సదుపాయాలు, క్రీడా వసతులు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. కాలనీ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపినందుకు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం మాట్లాడిన కేపీ వివేకానంద్ కాలనీవాసుల ఐక్యతే అభివృద్ధికి ప్రధాన బలమని అన్నారు. ప్రజలు ఏకతాటిపై ఉండి తమ ప్రాంత సమస్యలను సమిష్టిగా పరిష్కరించుకునేందుకు కృషి చేసినప్పుడే మరింత మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. ప్రజల సహకారంతోనే అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా అమలు చేయగలుగుతున్నామని వివరించారు. గత పన్నెండు సంవత్సరాల కాలంలో కోట్లాది రూపాయల నిధులతో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు, రహదారులు, డ్రైనేజీలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధి చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. యువత కోసం క్రీడా వసతులు, కుటుంబాల అవసరాలకు అనుగుణంగా పలు అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేశామని పేర్కొన్నారు. ఈ పనుల వల్ల కాలనీ నివాసుల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని అన్నారు.



# బోనాల వేడుకల్లో కేపీ వివేకానంద్

**నల్ల పోచమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు**

**అంగడిపేటలో ఘనంగా ఉత్సవాలు**

**హైదరాబాద్, ఆగస్టు 8 :**
జీడిమెట్ల డివిజన్ పరిధిలోని అంగడిపేటలో నల్ల పోచమ్మ దేవాలయంలో నిర్వహించిన బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో సాగాయి. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ శాసనసభ పక్ష విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించడం ఆనందదాయకమని ఆయన పేర్కొన్నారు. దేవాలయానికి చేరుకున్న కేపీ వివేకానంద్‌కు ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు స్వాగతం పలికారు. అనంతరం నల్ల పోచమ్మ అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్ర ప్రజల సుఖసంతోషాలు, శాంతి భద్రతలు, సమృద్ధి కోసం ప్రార్థనలు చేశారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే బోనాల పండుగకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ప్రజల ఐక్యతను, ఆధ్యాత్మిక విశ్వాసాలను బలపరిచే ఇటువంటి పండుగలను ప్రతి ఒక్కరూ ఘనంగా నిర్వహించాలని సూచించారు. దేవాలయాలు సామాజిక ఐక్యతకు కేంద్రాలుగా నిలుస్తున్నాయని తెలిపారు. బోనాల సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. డప్పుల వాయిద్యాలు, సాంప్రదాయ కళారూపాలు ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారుల నుంచి పెద్దల వరకు ఉత్సాహంగా పాల్గొని పండుగ వైభవాన్ని మరింత పెంచారు.

# హూవర్ డ్యామ్ సందర్శించిన పుట్ట మధు

**అమెరికా పర్యటనలో ప్రముఖ జలాశయ పరిశీలన**

**ఇంజినీరింగ్ అద్భుతంపై ఆసక్తికర అధ్యయనం**

**నీటి నిర్వహణ విధానాలపై అవగాహన**

**అభివృద్ధి నమూనాలను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే**

**మంథని, ఆగస్టు 8 :**
అమెరికా పర్యటనలో భాగంగా మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ప్రపంచ ప్రఖ్యాత హూవర్ డ్యామ్‌ను సందర్శించారు. ఆయనతో పాటు పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్ సింగ్ కూడా ఈ పర్యటనలో పాల్గొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఇంజినీరింగ్ అద్భుతంగా గుర్తింపు పొందిన ఈ డ్యామ్ నిర్మాణ విశేషాలను వారు ప్రత్యక్షంగా పరిశీలించారు. హూవర్ డ్యామ్ నిర్మాణ శైలి, జలవనరుల వినియోగం, నీటి నిల్వ సామర్థ్యం, జలవిద్యుత్ ఉత్పత్తి విధానాల గురించి అక్కడి అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. భారీ ప్రాజెక్టుల రూపకల్పనలో ఆధునిక సాంకేతికతను ఎలా వినియోగిస్తున్నారనే అంశంపై ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. నీటి నిర్వహణలో అనుసరిస్తున్న పద్ధతులను కూడా అధ్యయనం చేశారు.

ప్రపంచంలోనే అత్యంత ప్రాముఖ్యత కలిగిన జలవనరుల ప్రాజెక్టులలో హూవర్ డ్యామ్ ఒకటిగా నిలిచిందని పుట్ట మధూకర్ పేర్కొన్నారు. ఇలాంటి నిర్మాణాలు కేవలం నీటి నిల్వలకే కాకుండా విద్యుత్ ఉత్పత్తి, వ్యవసాయం, తాగునీటి అవసరాల తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా వనరులను సమర్థంగా వినియోగించుకోవడం ఎంత ముఖ్యమో ఈ ప్రాజెక్టు ద్వారా తెలుస్తోందని అభిప్రాయపడ్డారు. అమెరికా పర్యటనలో భాగంగా వివిధ ప్రాంతాల్లోని మౌలిక వసతులు, అభివృద్ధి నమూనాలు, సాంకేతిక పురోగతిని పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు. అభివృద్ధి చెందిన దేశాల్లో అమలవుతున్న విధానాలను అధ్యయనం చేయడం ద్వారా కొత్త ఆలోచనలు, అనుభవాలు పొందే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఇలాంటి అంశాలను తెలుసుకోవడం అవసరమని అన్నారు. హూవర్ డ్యామ్ పరిసర ప్రాంతాల్లోని ప్రకృతి సౌందర్యాన్ని కూడా వారు ఆస్వాదించారు. డ్యామ్ చుట్టూ ఉన్న ప్రాంతాల అభివృద్ధి, పర్యాటక సౌకర్యాలు, సందర్శకుల కోసం ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. ప్రపంచం నలుమూలల నుంచి వేలాది మంది పర్యాటకులు ఈ ప్రాంతాన్ని సందర్శించడం విశేషమని తెలిపారు. పర్యటన సందర్భంగా పుట్ట మధూకర్, రఘువీర్ సింగ్ డ్యామ్ వద్ద కొంత సమయం గడిపి అక్కడి విశేషాలను పరిశీలించారు. అనంతరం హూవర్ డ్యామ్ వద్ద జ్ఞాపకార్థంగా చిత్రాలు దిగారు.







# నేర సంస్కృతికి తెరలేపిన దుండగులు

## గురాన కుటుంబం సౌమ్యానికి పెట్టింది పేరు

### కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు .. మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం, ఆగస్టు 8: గతంలో ఎన్నడూ లేని విధంగా విజయనగర పట్టణంలో దుండగులు నేర సంస్కృతికి తెరలేపారని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. దుండగుల దాడిలో శుక్రవారం గాయపడిన జనసేన నాయకులు గురాన అయ్యలు ను, వారి కుటుంబాన్ని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పరామర్శించారు. ఈ సందర్భంగా అయ్యలు నుండి దాడి జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం జరిగిన మీడియా మిత్రులకు సమావేశంలో మాట్లాడుతూ పట్టణంలో సౌమ్యులుగా పేరు గలిగిన గురాన సాదురావు తనయులు అయ్యలు పై దుర్భాషలాడటంతో పాటు ఇంటిలోకి చొరబడి దాడి చేయడం చాలా దారుణమన్నారు. ఆలయ విషయంలో ప్రారంభమైన వివాదం నేపథ్యంలో ఇంటి మీదకు వచ్చి దాడికి పాల్పడినట్లు తెలిసిందని, కూటమి ప్రభుత్వం తరపున ఈ దాడిని ఖండిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. పట్టణంలో పార్టీలకతీతంగా ఒకరికి ఒకరు గౌరవం ఇచ్చుకోవడం సాంప్రదాయమని, దాడి చేయటానికి వైకాపా నాయకులు ప్రేరేపణ చేశారని తెలుస్తుందన్నారు. దాడి చేసిన వారితో పాటు వారి వెనక ఉన్న వ్యక్తులను కూడా గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని, దాడిపై సమగ్ర దర్యాప్తుతో కూడిన విచారణ చేపట్టాలని పోలీసు వారికి ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. దాడి విషయంలో చట్టం తన పని తాను చేసుకుంటుందని, శాంతియుతంగా ఉండే విజయనగరంలో ఘర్షణలకు, గొడవలకు ప్రేరేపించవద్దని హితవు పలికారు. దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయటంతో పాటు రిమాండ్ కు కూడా పంపించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రసాదుల ప్రసాదు, కణకల మురళి, మరాపు సురేష్, కోదండరామ్, గొల్లకోటి శివ, కింగ్ శ్రీను అధిక సంఖ్యలో కూటమి నాయకులు పాల్గొన్నారు.



# తెలంగాణ కాంగ్రెస్ పార్టీ మీడియా పబ్లిసిటీ విభాగం చైర్మన్‌కు శుభాకాంక్షలు

యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి: తెలంగాణ కాంగ్రెస్ పార్టీ మీడియా పబ్లిసిటీ డిపార్ట్మెంట్ చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా గౌరవ భువనగిరి పార్లమెంట్ సభ్యులు శ్రీ చామల కిరణ్ కుమార్ రెడ్డి గారిని మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు హీరేకార్ శ్రీను, ఎం.డి. కరీం ఈరోజు మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి నూతన బాధ్యతల్లో విజయవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. పార్టీ బలోపేతానికి మీడియా విభాగం కీలక పాత్ర పోషించాలని వారు పేర్కొన్నారు.



మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలంలోని చందంపేటలో సర్పంచ్ నాయిని ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం మురుగు కాలువలపై బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేశారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కాచి వడబోసిన నీటిని తాగాలని, ఆహారాన్ని వేడిగా తీసుకోవాలని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నర్సింలు పాల్గొన్నారు.

# భూసేకరణ, పునరావాసానికి నిధుల కొరత రానివ్వం

### రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్ , ఆగస్టు 8: సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పునరావాసం--పునర్నిర్మాణం పనులకు నిధుల కొరత రానివ్వబోమని రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం హైదరాబాద్ లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని సాగునీటి ప్రాజెక్టుల పురోగతి అభివృద్ధి పనులపై ఇన్చార్జి మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు , మంత్రులు దుదిల్ల శ్రీధర్ బాబు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పొన్నం ప్రభాకర్ నాలుగు జిల్లాల కలెక్టర్ల తో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా లిమంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూలి సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ (LA), పునరావాసం--పునర్నిర్మాణం (R&R) కోసం రూ.5 వేల కోట్లు సమకూర్చేందుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని, ఇప్పటికే రూ.2 వేల కోట్లు విడుదలయ్యాయని, మిగిలిన రూ.3 వేల కోట్ల విడుదల ప్రక్రియ కొనసాగుతోందని వెల్లడించారు. నిధుల కొరత కారణంగా పూర్తికి చేరువలో ఉన్న ఏ సాగునీటి ప్రాజెక్టు పనులు నిలిచిపోవడానికి వీల్లేదని మంత్రి స్పష్టం చేశారు. భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్, అటవీ, పర్యావరణ అనుమతులను అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.



# కుబీర్‌లో ప్రజాధనం వృథా

### పూర్తికాకముందే కూలిన రూ.76 లక్షల మురికి కాలువ!

కుబీర్, ఆగస్టు 08: నిర్మల్ జిల్లా కుబీర్ మండల కేంద్రంలోని వడ్డెర కాలనీ నుంచి పెద్దవాగు వరకు దాదాపు 76 లక్షల రూపాయల భారీ బడ్జెట్‌తో చేపట్టిన మురికి కాలువ (డ్రైనేజీ) నిర్మాణం, కనీసం పూర్తికాకముందే కుప్పకూలిపోయింది. అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్లే ఈ దారుణం జరిగిందని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వడ్డెర కాలనీ, మేదరి గల్లి ప్రజలు, అలాగే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణం దశాబ్దాలుగా మురుగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షాలు కురిసిన సమయంలో ఆస్పత్రి ప్రాంగణంలోకి, మేదర గల్లీలో నివసిస్తున్న ఇళ్లల్లోకి మురికి నీరు చేరేది. ఈ సమస్యను ఇటీవల జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా స్వయంగా పరిశీలించారు. ఇక్కడి ప్రజల కష్టాలను చూసి చలించిన ఆయన, సమస్య శాశ్వత పరిష్కారం కోసం ప్రత్యేకంగా రూ.76 లక్షల నిధులను మంజూరు చేయించారు.

# గ్రామీణ ప్రాంతాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి

### తెలుగుదేశం కార్యక్రమం నిర్వహణ.. మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గజపతినగరం, ఆగస్టు 8: గ్రామీణ ప్రాంతాలలో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు నియోజకవర్గంలోని జామి మండలం వెన్నె గ్రామంలో పర్యటించారు. ఇందులో భాగంగా 75 లక్షల రూపాయలతో నిర్మించిన సిసి రోడ్డు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల కాలంలో చేపట్టిన సంక్షేమాభివృద్ధి కార్యక్రమాల ప్రతులను మంత్రి ప్రజలకు అందించారు.



# ఇంటింటికి తెలుగుదేశం ప్రతి ఇంటా ఆనందం

### -మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు

గజపతినగరం, ఆగస్టు 8: ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం ప్రతి ఇంటా ఆనందం కలిగిస్తుందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. గజపతినగరం నియోజక వర్గం దత్తిరాజేరు మండలం గొబ్యాం గ్రామంలో శనివారం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారి ఆధ్వర్యంలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కు గ్రామస్తులు స్వాగతం పలికి స్థానిక రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు

కూటమి ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న పథకాల వివరాలతో కూడిన కరపత్రాలను మంత్రి గ్రామస్తులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు అందించిన పథకాలు ప్రతి ఇంటికి తెలియజేయడంతో పాటు గ్రామాల్లో ప్రజలకు కావలసిన సదుపాయాలను, సమస్యలను తెలుసుకోవడం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని రూపొందించడం జరిగిందన్నారు. గత రెండేళ్ల పాలనలో ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత, అవసరం ప్రతి ఒక్క కార్యకర్త, నాయకుడి పై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి, ఏఎంసీ చైర్మన్ పివివి గోపాలరాజు, బిజెపి నాయకులు రెడ్డి పావని, జనసేన నాయకులు మరపు సురేష్, మండల పార్టీ అధ్యక్షులు చప్పా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.





# రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలు

### రైతుల కళ్ళల్లో ఆనందమే ప్రభుత్వ ధ్యేయం

### సక్రమంగా విధులు నిర్వహించాలి

### మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు

గజపతినగరం, ఆగస్టు 8 : రైతన్నల శ్రేయస్సుకోసం రాజముద్ర తో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు అందించడం జరుగుతుందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. గజపతినగరం నియోజకవర్గం దత్తిరాజేరు మండలం వింధ్యావాసి గ్రామంలో శనివారం పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు పాల్గొన్నారు ఈ సందర్భంగా గ్రామంలో రీ సర్వే పూర్తయిన 309 మంది రైతులకు చెందిన పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు అందజేశారు.

గత ప్రభుత్వంలో పట్టాదారు పాసు పుస్తకాలపై మరియు సర్వే రాళ్లపై ఫోటోలు ముద్రించి పంపిణీ చేశారని, దీంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాజముద్ర తో కూడిన పాస్ పుస్తకాలు అందజేసి రైతన్నలకు అండగా నిలుస్తామని ప్రకటించిన విధంగానే రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాలలో రీ సర్వే చేసి పాస్ పుస్తకాలు అందించడం జరుగుతుందన్నారు. భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని, రీ సర్వే జరిగిన తీరును ప్రజలకు వివరించాలన్నారు. అధికారులు ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరయ్యేటప్పుడు సమగ్ర సమాచారంతో హాజరు కావాలని, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా అధికారులు పనిచేయాలని ఆదేశించారు. అధికారులు బాధ్యతారాహిత్యం గా పని చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. మనభూమి – మన హక్కు పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు పట్టాదారు పాస్ పుస్తకాలలో ఎటువంటి అపోహలకు తావు లేకుండా రాజముద్రతో కూడిన పాస్ పుస్తకం అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి, ఏఎంసీ చైర్మన్ పివివి గోపాలరాజు, బిజెపి నాయకులు రెడ్డి పావని, మండల పార్టీ అధ్యక్షులు చప్పా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.




# కలిసొచ్చిన వార్మప్





## పడిక్కల్ భారీ శతకం.. జడ్డూ, సుతార్ జోరు.. కుదేలైన లంక బౌలర్లు

శ్రీలంకతో టెస్టు సిరీస్‌కు సన్నాహక మ్యాచ్‌లో భారత జట్టు ఆదిలో తడబడినా చివరకు నిలబడింది. మూడు రోజుల వామప్ మ్యాచ్‌లో ప్రధాన ఆటగాళ్లు విఫలమైనా పడిక్కల్(142 నాటౌట్ ) భారీ శతకంతో రెచ్చిపోయాడు.

**కేఎల్ రాహుల్(41), రవీంద్ర జడేజా(63 రిటైర్డ్ హర్ట్)లతో కీలక భాగస్వామ్యం నెలకొల్పిన పడిక్కల్.. ఆఖరి ఓవర్ వరకూ క్రీజునంటుకు పోయాడు. మానవ్ సుతార్(41) సైతం గొప్పగా ఆడడంతో టీమిండియాను ఆలౌట్ చేయాలనుకున్న లంక బౌలర్ల ఆశలు ఆవిరయ్యాయి.**

వామప్ మ్యాచ్‌లో భారత బ్యాటర్ దేవ్‌దత్ పడిక్కల్((142 నాటౌట్) శతకంతో భారీ స్కోరందించాడు. ఓపెనర్ యశస్వీ జైస్వాల్(0) డకౌటైన తర్వాత క్రీజులోకి వచ్చిన పడిక్కల్ మూడో స్థానంలో నేను ఆడగలను అని చాటుకుంటూ శతకంతో చెలరేగాడు. కేఎల్ రాహుల్(40), రవీంద్ర జడేజా(63 రిటైర్డ్ హర్ట్)లతో కలిసి కీలక భాగస్వామ్యాలు నెలకొల్పిన ఈ కుర్రాడు లంక బౌలర్లను విసిగించాడు. యశస్వీ వికెట్ అనంతరం రాహుల్, పడిక్కల్ దూకుడుగా ఆడారు. అర్ధ శతక భాగస్వామ్యంతో లంక బౌలర్ల సహనాన్ని పరీక్షించిన ఈ ద్వయాన్ని కేశర నువాంత(1-40) విడదీశాడు. ఆ తర్వాత వచ్చిన రిషభ్ పంత్(2), ధ్రువ్ జురెల్(1) లు విఫలమైన చోట క్రీజునంటుకున్న పడిక్కల్ ఒత్తిడికి లోనవ్వకుండా స్కోర్ బోర్డును నడిపించాడు. ఆఖర్లో మానవ్ సుతార్(41) సైతం రాణించగా భారత్ స్కోర్ దాటింది. అనంతరం గుర్నూర్ బ్రార్(36 నాటౌట్) జతగా లంక ఎక్స్‌ఐ బౌలర్లను కాచుకున్న పడిక్కల్ అజేయంగా నిలిచాడు. దాంతో, రెండో రోజు ఆట ముగిసే సరికి టీమిండియా 6 వికెట్ల నష్టానికి 357 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో ఇంకా 6 రన్స్ వెనకబడి ఉందంతే. మొదట బ్యాటింగ్ చేసిన లంక 363-8 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. ఆదివారం ఆఖరి రోజు కావడంతో వామప్ మ్యాచ్ డ్రాగా ముగియడం ఖాయం.






### జాగా కావాలన్న పంత్..

## ఓకే అన్న సీఎం

భారత క్రికెట్ జట్టు వికెట్ కీపర్-బ్యాటర్ రిషబ్ పంత్ తన స్వరాష్ట్రమైన ఉత్తరాఖండ్‌లో భూమి కొనుగోలు చేసేందుకు సహాయం చేయాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామిని సోషల్ మీడియా వేదికగా కోరాడు. పంత్ విజ్ఞప్తిపై సీఎం సానుకూలంగా స్పందించి, పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఈ సంభాషణ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ప్రస్తుతం శ్రీలంక పర్యటనలో ఉన్న రిషబ్ పంత్, తాను ఢిల్లీ నుంచి తన సొంత రాష్ట్రానికి మకాం మార్చి, తన మొదటి ఇల్లు కట్టుకోవాలనుకుంటున్నట్లు 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతాలో పోస్ట్ చేశాడు. "గత మూడేళ్లుగా సరైన స్థలం కోసం ప్రయత్నిస్తున్నాను. కానీ ఈ ప్రక్రియలో ఎదురవుతున్న ఇబ్బందులు, స్పష్టత లేకపోవడం ఒక పీడకలలా మారింది. నా పహాడీ ప్రజల మధ్య జీవించాలని, రాష్ట్రానికి సేవ చేయాలని ఉంది" అని పేర్కొంటూ సీఎం సహాయాన్ని అభ్యర్థించాడు. అయితే, మరో పోస్ట్‌లో పంత్ ఒక స్పష్టత ఇచ్చాడు. అంతర్జాతీయంగా రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించినందుకు బహుమతిగా భూమి ఇస్తే సంతోషమే అయినా, తాను మాత్రం ప్రభుత్వ నిబంధనల ప్రకారం వర్తించే ధరలకే భూమిని కొనుగోలు చేయాలనుకుంటున్నట్లు తెలిపాడు. పంత్ పోస్ట్‌పై సీఎం పుష్కర్ సింగ్ ధామి స్పందించారు. 'రిషబ్ పంత్ ఉత్తరాఖండ్ గర్వకారణం' అని ప్రశంసించారు. నిబంధనల ప్రకారం అన్ని విధాలా సహకరించాలని సంబంధిత అధికారులను ఆదేశించామని, వారు త్వరలోనే పంత్‌ను సంప్రదిస్తారని ఆయన బదులిచ్చారు. "ప్రియమైన రిషబ్.. మీరు ఉత్తరాఖండ్‌కు గర్వకారణం. మీ అద్భుతమైన ప్రదర్శన, విజయాలతో మీరు దేశంలో, ప్రపంచంలో దేవభూమి పేరును ప్రకాశింపజేశారు. మీ మాతృభూమిపై మీకున్న ప్రేమ, ఇక్కడికి తిరిగి వచ్చి సేవ చేయాలనే మీ ఆకాంక్ష ఎంతో ప్రశంసనీయం.




### ఇంగ్లండ్ హెడ్‌కోచ్‌గా

## ఫ్లింటాఫ్ గుడ్ బై

ఇంగ్లండ్ వెటరన్ ఆండ్రూ ఫ్లింటాఫ్ కోచింగ్ బాధ్యతల నుంచి వైదొలిగాడు. తమ దేశానికి చెందిన జూనియర్ టీమ్ ఇంగ్లండ్ లయన్స్‌కు కోచింగ్ ఇస్తున్న ఈ మాజీ ఆల్‌రౌండర్ తన పదవికి రాజీనామా చేశాడు. రెండేళ్లుగా ఆ జట్టును తీర్చిదిద్దిన ఫ్లింటాఫ్ ఆగస్టు 8, శనివారంతో తన సేవలకు స్వస్తి పలికాడు. ఇకపై ఫ్రాంచైజీ క్రికెట్‌లో కోచ్‌గా కొనసాగనున్నాడు. 'లయన్స్ కోచ్‌గా వైదొలగాలని దురదృష్టవశాత్తూ నిర్ణయం తీసుకున్నా. దేశంలోని యువ క్రికెటర్లతో సమయం గడపడం, వారికి శిక్షణ ఇచ్చే అవకాశాన్ని నేను ఎంతో ఆస్వాదించాను. వారిని మరింత ఉన్నత స్థాయిలో చూడాలనుకున్నా. తదుపరి సిడ్నీ థండర్స్‌కు ప్రధాన కోచ్‌గా సేవలందించేందుకు నేను ఇక వేచి ఉండలేకపోతున్నా' అని ఫ్లింటాఫ్ పేర్కొన్నాడని ఇంగ్లండ్ వేల్స్ క్రికెట్ బోర్డు వెల్లడించింది. లయన్స్ హెడ్‌కోచ్‌గా 2004 సెప్టెంబర్‌లో ఫ్లింటాఫ్ బాధ్యతలు చేపట్టాడు.



## హండ్రెడ్ లీగ్ నుంచి జెమీమా ఔట్

భారత మహిళా క్రికెట్ జట్టు స్టార్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ కీలకమైన హండ్రెడ్ లీగ్ నుంచి మధ్యలోనే వైదొలిగింది. హ్యామ్‌స్ట్రింగ్ గాయం కారణంగా ఆమె భారత్‌కు తిరిగి రానుంది. త్వరలో జరుగబోయే ఆసియా కప్‌కు కూడా ఆమె అందుబాటులో ఉండే అవకాశం లేదని తెలుస్తోంది. హండ్రెడ్ లీగ్‌లో జెమీ సదర్న్ బ్రేవ్‌కు ప్రాతినిధ్యం వహిస్తోంది. ఆమె కోసం ఫ్రాంచైజీ ఏకంగా 60,000 పౌండ్లు చెల్లించింది. అయితే గాయం కారణంగా టోర్నీలో మిగిలిన మ్యాచ్‌లకు ఆమె దూరం కానుంది. జెమీమా స్థానంలో ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ చార్లీ నాట్‌ను సదర్న్ బ్రేవ్ ఎంపిక చేసింది. ఈ సీజన్‌లో జెమీమా 6 మ్యాచ్‌ల్లో 143 పరుగులు చేసింది. ఆమె సగటు 35.75గా ఉంది. ఒక్క అర్ధశతకం కూడా నమోదు చేయకపోయినా వరుసగా మూడు మ్యాచ్‌ల్లో 25కు పైగా పరుగులు సాధించింది.

### మెస్సీ తండ్రి

## కన్నుమూత

ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ ఇంట తీవ్ర విషాదం చోటు చేసుకుంది. మెస్సీ తండ్రి జార్జ్ హొరాసియో మెస్సీ (68) కన్నుమూశారని పలు అంతర్జాతీయ మీడియా సంస్థలు వెల్లడించాయి. జార్జ్ మెస్సీ అర్జెంటీనాలోని రొసారియోలో శుక్రవారం రాత్రి తుదిశ్వాస విడిచినట్లు సమాచారం. జార్జ్ మెస్సీ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఆయన మృతికి గల ఖచ్చితమైన కారణాన్ని ఎవరూ వెల్లడించలేదు. లియోనెల్ మెస్సీ ఫుట్‌బాల్ ప్రయాణంలో జార్జ్ మెస్సీ పాత్ర ఎంతో కీలకం. చిన్నతనం నుంచే తన కుమారుడి కెరీర్‌ను దగ్గరుండి పర్యవేక్షించిన ఆయన, మెస్సీ ప్రొఫెషనల్ ఫుట్‌బాల్‌లోకి అడుగుపెట్టిన తర్వాత కూడా అతడి ప్రతినిధిగా, సలహాదారుగా వ్యవహరించారు. మెస్సీ చిన్న వయసులోనే స్పెయిన్‌లోని బార్సిలోనాకు వెళ్లిన సమయంలో కూడా జార్జ్ ఆయన వెంట ఉన్నారు. అనంతరం మెస్సీ కెరీర్‌కు సంబంధించిన ఆర్థిక, వృత్తిపరమైన వ్యవహారాల్లోనూ ఆయన కీలక పాత్ర పోషించారు.

## క్రికెటర్లకు ఎందుకీ గాయాలు?

### నేడు బెంగళూరులో బీసీసీఐ అత్యవసర భేటీ

భారత క్రికెటర్లు తరచూ గాయాల బారిన పడడం.. సిరీస్ మధ్యలోనే స్క్వాడ్ నుంచి వైదొలగడం చూస్తున్నాం. ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రా, సాయి సుదర్శన్‌లు చివరకు శ్రీలంక పర్యటన మొత్తానికి దూరమవ్వడం పట్ల బీసీసీఐ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. అసలు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఏం జరుగుతోంది? ఆటగాళ్లు ఎందుకు త్వరగా కోలుకోవడం లేదు? అనే అంశంపై అత్యవసర సమీక్షకు సిద్ధమవుతోంది బీసీసీఐ. విదేశీ పర్యటనల్లో భారత ఆటగాళ్లు ఈమధ్య తరచూ గాయపడుతున్నారు. ఫలితంగా.. కొత్త కాంబినేషన్లు ప్రయత్నించడం, అవి బెడిసికొట్టి జట్టు విజయావకాశాల్ని దెబ్బతీయడం మామూలైపోయింది. పునరావాసంలో ఉండి.. ఫిట్‌గా తిరిగి వస్తారనుకుంటే.. బరువెక్కి కొందరు, గాయాలు నయమవ్వక కొందరు కీలక సిరీస్‌లకు దూరమవుతున్నారు. శ్రీలంక పర్యటనకు బుమ్రాతో పాటు సాయి సుదర్శన్ అందుబాటులో లేకపోవడంపై ఆగ్రహించిన భారత క్రికెట్ నియంత్రణ మండలి అత్యవసర సమీక్ష చేయనుంది. దాంతో, బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా హుటాహుటిన శనివారమే బెంగళూరుకు బయల్దేరాడు. అక్కడ సీఓఈ డైరెక్టర్ వీవీఎస్ లక్ష్మణ్‌తో ఆదివారం అతడు రిహాబిలిటేషన్ తీరుతెన్నులు పరిశీలించి.. అసలేం జరుగుతుందో తెలుసుకోనున్నాడు.






## 104 డిగ్రీల జ్వరంతోనూ అవికాగోర్ షూటింగ్

చిన్నారి పెళ్లికూతురు ఫేమ్ అవికా గోర్ ప్రస్తుతం అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరారు. గత కొన్ని రోజులుగా తీవ్రమైన జ్వరంతో బాధపడుతున్న ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించగా డెంగ్యూ పాజిటివ్‌గా తేలింది. ప్రస్తుతం ఆమె ముంబైలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అవికా గోర్ భర్త మిలింద్ చంద్వానీ సోషల్ మీడియా వేదికగా ఆమె ఆరోగ్య పరిస్థితిని వెల్లడించారు. గత ఐదు రోజులుగా ఆమె ఏకంగా 104 డిగ్రీల జ్వరంతో బాధపడుతున్నప్పటికీ, షూటింగ్‌కు ఎలాంటి అంతరాయం కలగకూడదనే ఉద్దేశంతో తన వృత్తిపై ఉన్న అంకితభావాన్ని చాటుకున్నారు. నిర్మాతలకు నష్టం జరగకూడదనే ఆలోచనతో ఆమె తీవ్ర అనారోగ్యంలోనూ షూటింగ్‌లలో పాల్గొనడమే కాకుండా, ఒక యాడ్ షూట్ కోసం ఢిల్లీకి కూడా ప్రయాణించారు. అయితే నీరసం, జ్వరం మరింత పెరగడంతో ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది. ఆమె నటించిన సరికొత్త హిందీ మ్యూజిక్ ఆల్బమ్ 'బుఖార్' (జ్వరం) విడుదలైన రోజే ఆమె నిజంగానే జ్వరంతో ఆసుపత్రిపాలవడం గమనార్హం.

## అంతా టాక్సికే!



కేజీఎఫ్ స్టార్ యశ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోనప్స్' ట్రైలర్ శనివారం విడుదలైంది. గ్యాంగ్‌స్టర్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం, తాజాగా విడుదలైన ట్రైలర్‌తో ఉత్కంఠభరితమైన యాక్షన్ సన్నివేశాలను పరిచయం చేసింది. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ ట్రైలర్‌ను అద్భుతమైన విజువల్స్, రోమాంచితమైన యాక్షన్ సీక్వెన్స్‌లతో ఆకట్టుకునేలా రూపొందించారు. ప్రధానంగా రాయ (యశ్), అతని కుమారుడు టికెట్ మధ్య ఉన్న సంక్లిష్టమైన సంబంధాన్ని ఇందులో ఆవిష్కరించారు. కథలోని కీలక మలుపులను రహస్యంగా ఉంచుతూనే, "అరాచకం మరో అరాచకాన్ని కలిస్తే ఎలా ఉంటుంది" అనే ఆసక్తికరమైన థీమ్‌ను హైలైట్ చేశారు. నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, రుక్మిణీ వసంత్, హుమా ఖురేషీ వంటి భారీ తారాగణం పోషించిన పాత్రలను సైతం ఈ ట్రైలర్‌లో పరిచయం చేయడం విశేషం. కన్నడ, ఆంగ్ల భాషల్లో ఏకకాలంలో తెరకెక్కిన ఈ చిత్రం, తెలుగు, తమిళం, హిందీ, మలయాళం భాషల్లోకి అనువాదమై విడుదల కానుంది. కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంస్థలు ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. గతంలో ఈ సినిమాకు సంబంధించి విడుదలైన ఒక లుక్‌లోని శ్మశాన వాటిక సన్నివేశం వివాదాస్పదమై ఎఫ్ఐఆర్ కూడా నమోదైన సంగతి తెలిసిందే.



## 'ఇరుముడి' ట్రైలర్

తాజా సమాచారం ప్రకారం ఆగస్టు 12న 'ఇరుముడి' ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. భీమవరంలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఈ ట్రైలర్ లాంచ్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమానికి చిత్ర బృందంతో పాటు అభిమానులు, సినీ ప్రేక్షకులు భారీగా హాజరయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే 'ఇరుముడి' నుంచి వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై పాజిటివ్ వైబ్స్‌ను తీసుకొచ్చింది. దీంతో ట్రైలర్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. కుటుంబ భావోద్వేగాలు, భక్తి అంశాలతో పాటు రవితేజకు సంబంధించిన మాస్ ఎలివేషన్స్‌ను ట్రైలర్‌లో ఎలా చూపించారనేది ఆసక్తికరంగా మారింది.



## చిల్లర వార్తలెందుకు?

బాలీవుడ్‌తో పాటు టాలీవుడ్‌లోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి మృణాల్ ఠాకూర్ గురించి గత కొంతకాలంగా ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. టీమిండియా యువ క్రికెటర్ యశస్వి జైస్వాల్‌తో ఆమె డేటింగ్‌లో ఉందంటూ నెట్టింట జోరుగా ప్రచారం జరిగింది. అయితే ఈ వార్తలపై తాజాగా మృణాల్ ఠాకూర్ స్వయంగా స్పందించి క్లారిటీ ఇచ్చారు. తనపై వస్తున్న పుకార్లపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ ఘాటైన సమాధానం ఇచ్చారు. ఇటీవల ముంబైలోని బాంద్రా ప్రాంతంలోని ఓ కేఫ్ నుంచి మృణాల్ ఠాకూర్, యశస్వి జైస్వాల్ వేర్వేరు సమయాల్లో బయటకు వస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో వీరిద్దరి మధ్య ఏదో సంబంధం ఉందంటూ నెటిజన్లు ఊహాగానాలు మొదలుపెట్టారు. ఇద్దరూ కలిసి కనిపించకపోయినా.. ఒకే ప్రాంతంలో కనిపించడం డేటింగ్ రూమర్స్‌కు కారణమైంది. ఈ వార్తలు సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ కావడంతో చివరకు మృణాల్ స్పందించాల్సి వచ్చింది. యశస్వి జైస్వాల్‌తో మృణాల్‌ను లింక్ చేస్తూ ఇన్‌స్టాగ్రామ్‌లో చేసిన ఓ పోస్టుపై ఆమె ఘాటుగా స్పందించారు. నిరాధారమైన వార్తలను ప్రచారం చేయడంపై అసహనం వ్యక్తం చేస్తూ.. అసలు తన పక్కన యశస్వి ఎక్కడ ఉన్నాడో చూపించాలని ప్రశ్నించారు. చదువుకున్న వారు కూడా ఇలాంటి ఆధారాలు లేని వార్తలను ఎలా నమ్ముతున్నారో అర్థం కావడం లేదని ఆమె వ్యాఖ్యానించారు. దేశంలో ఎన్నో ముఖ్యమైన విషయాలు జరుగుతున్నాయని, వాటిపై దృష్టి పెట్టకుండా ఇలాంటి చిల్లర వార్తలకు ప్రాధాన్యత ఇవ్వడం సరికాదని సూచించారు.



## నాని హీరోగా భాగ్యశ్రీ మువీ

అక్కినేని అఖిల్ హీరోగా వచ్చిన 'లెనిన్' సినిమా సక్సెస్‌తో ఫుల్ జోష్‌లో ఉన్న హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సేకి మరో క్రేజీ ఆఫర్ దక్కబోతున్నట్టు తెలుస్తోంది. నేచురల్ స్టార్ నాని హీరోగా సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కనున్న 'బ్లడీ రోమియో' సిని మాలో భాగ్యశ్రీని హీరోయిన్‌గా తీసుకునే ఆలోచనలో మేకర్స్ ఉన్నట్టు సమాచారం. అయితే దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. రవితేజ హీరోగా వచ్చిన 'మిస్టర్ బచ్చన్'తో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన భాగ్యశ్రీకి వరుసగా క్రేజీ సినిమాలు వచ్చాయి. కానీ ఆశించిన స్థాయిలో విజయాలు మాత్రం దక్కలేదు. 'లెనిన్'తో ఆమెకు తొలి సాలిడ్ హిట్ దక్కింది. ఈ సక్సెస్‌తో భాగ్యశ్రీ ప్రస్తుతం టాలీవుడ్‌లో వరుస అవకాశాలు అందుకుంటోంది.

"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948,** Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467